www.asthram.com
www.epaper.asthram.com
RNI : TGTEL/25/A1872

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక
బుధవారం 12 నవంబర్ 2025
సంగారెడ్డి  సంచిక : 76  సంపుటి : 1  పేజీలు : 8  వెల : రూ. 5/-

## రూ.189 ఎంట్రీలెవల్ ప్రీపెయిడ్ ప్లాన్ నిలిపేసిన ఎయిర్‌టెల్

దేశీయ టెలికాం రంగంలో చౌకైన ప్లాన్‌లను తొలగించే పరంపర ఇంకా కొనసాగు తున్నట్టు కనిపిస్తోంది. తాజాగా ప్రైవేట్ రంగ టెలికాం భారతీ ఎయిర్‌టెల్ తన కస్టమర్లకు షాక్ ఇచ్చింది. ఈ ఏడాది జూలైలో తీసుకొచ్చిన రూ. 189 ఎంట్రీ-లెవెల్ ప్రీపెయిడ్ ప్లాన్‌ను తొలగించినట్టు సమాచారం. ప్రస్తుతం కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ ప్లాన్ కనిపించడంలేదు. ఈ ప్లాన్ ప్రధానంగా వాయిస్ కాల్స్ కోసం, తక్కువ డేటాతో అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్‌ను నిలిపివేయడం వల్ల కాల్స్ కోసం మాత్రమే సెకండరీ సిమ్‌లో దీన్ని ఉపయోగిస్తున్న వారికి ఖర్చులు పెరగనున్నాయి. ఇప్పుడు రూ. 199తో కనీస రీఛార్జ్ ప్లాన్‌కు మారాల్సి ఉంటుంది.

# జూబ్లీహిల్స్ హస్తందే!



### జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు విడుదల

### ముగిసిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్

**ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వెల్లడించిన చాణక్య స్ట్రాటజీస్, హెచ్?ఎంఆర్, స్మార్ట్‌పోల్ సర్వే**

**ఈనెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు**

**కాంగ్రెస్‌కు 46శాతం, భారత రాష్ట్ర సమితికి(బీఆర్ఎస్) 43 శాతం, బీజేపీకి 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా**

హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఈనెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో గెలుపెవరిదనే దానిపై పలు సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను వెలువరించాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. చాణక్య స్ట్రాటజీస్ ప్రకారం కాంగ్రెస్‌కు 46శాతం, భారత రాష్ట్ర సమితికి (బీఆర్ఎస్) 43 శాతం, - మిగతా3లో





## జడ్జీలపై ఆరోపణలు చేయడం ట్రెండ్‌గా మారింది

- ఇలాంటి పరిణామాలు న్యాయవ్యవస్థ సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తాయి
- వీటిని అడ్డుకోవాలి.. సుప్రీంకోర్టు ఆందోళన
- ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో వాదనలు వింటాం
- వివిధ అంశాలను ఏఐ వ్యవస్థలతో కావాల్సిన విధంగా మల్చుకునే ప్రమాదముంది



## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టుల మృతి
- ఈ సమయంలో అక్కడ దాక్కున్న మావోయిస్టులు కాల్పులు జరిపారు
- భద్రతా దళాలు దీటుగా బదులిచ్చాయి

## సహకార రుణ రంగాన్ని విస్తరించడమే లక్ష్యం

- కేంద్ర మంత్రి అమిత్ షా
- అర్బన్ కో-ఆపరేటివ్ సెక్టార్‌లో ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇవ్వడాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు
- దేశంలోని 2,00,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పట్టణంలో వచ్చే ఐదేళ్లలో ఒక సహకార బ్యాంకు ఏర్పాటు
- గత రెండేళ్లలో ప్రభుత్వం ఎన్‌పీఏను 2.8 శాతం నుంచి 0.6 శాతానికి తగ్గించేందుకు ఎన్నో చర్యలు తీసుకుంది





## ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

- ఇస్లామాబాద్ జ్యుడీషియల్ కాంప్లెక్స్ వద్ద భారీ పేలుడు
- ఈ ఘటనలో 12 మంది మృతి, 20 మందికి పైగా గాయాలు
- మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని గుర్తింపు
- గ్యాస్ సిలిండర్ పేలుడా, ఆత్మాహుతి దాడా అనే కోణంలో దర్యాప్తు
- దక్షిణ వజీరిస్థాన్‌లో కేడెట్ కాలేజీపై టీటీపీ దాడి విఫలం
- ఈ దాడితో తమకు సంబంధం లేదని ప్రకటించిన టీటీపీ

# అందెశ్రీ పాటలతో ప్రజల్లో స్ఫూర్తి

- అందెశ్రీని పద్మశ్రీతో గౌరవించడానికి కృషి చేద్దాం
- అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశా
- ఈ విషయంపై ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తా
- వారికి పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ సహకరించాలి
- ఆయన రాసిన ప్రతీ పాట తెలంగాణలో స్ఫూర్తిని నింపింది
- ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర ఉండాలని తాను కోరా
- గద్దర్‌తో పాటు అందెశ్రీ కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపారు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్

పశువుల కాపరిగా, తాపీ మేస్త్రిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్ర సాధనలో ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ గొప్ప పాత్ర పోషించారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. వారిని కోల్పోవడం తెలంగాణ సమాజంతో పాటు వ్యక్తిగతంగా తనకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా తాను పనిచేసిన సమయంలో.. అందెశ్రీని కలిసి తెలంగాణ ప్రజల సమస్యలపై చర్చించానని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర ఉండాలని తాను కోరానని గుర్తుచేశారు. గద్దర్‌తో పాటు అందెశ్రీ కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపారని ఉద్ఘాటించారు. - మిగతా3లో



## బిహార్‌లో ఎన్‌డీఏ జయకేతనం

- ఎన్డీఏ కూటమినే అధికారం చేపట్టబోతున్నట్లు మెజార్టీ సర్వేలు వెల్లడి
- పీపుల్స్ సర్వే, టైమ్స్ నౌ, ఆపరేషన్ చాణక్యలు ఎన్డీఏకే పట్టం
- ఎన్డీయే కూటమికి 46.2 శాతం ఓట్లు
- మహాఘట్ బంధన్ కు 37.9 శాతం
- నూతనంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి 9.7 శాతం

## తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు



- మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసిన విషయం తెలసిందే
- రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ ఉత్తర్వులు
- వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్లు తక్షణ సాయం అందించాలని నిర్ణయం

హైదరాబాద్

మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన వరద బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్లు తక్షణ సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసిన విషయం తెలసిందే. - మిగతా3లో

# బిహార్‌లో ఎన్‌డీఏ జయకేతనం

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వీటిలో ఎన్డీఏ కూటమినే అధికారం చేపట్టబోతున్నట్లు మెజార్టీ సర్వేలు వెల్లడించాయి. పీపుల్స్ సర్వే, టైమ్స్ నౌ, ఆపరేషన్ చాణక్యలు ఎన్డీఏకే పట్టం కట్టాయి.




**పీపుల్స్ పల్స్**

బిహార్‌లో ఎన్‌డీఏ జయకేతనం

బిహార్ లో బీజేపీ, జేడీయూ(యూ) నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి భారీ మెజారిటీతో అధికారం చేపట్టే అవకాశాలు ఉన్నట్టు పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడయింది.

ఎన్డీయే కూటమి దాదాపు 8.3 శాతం ఓట్ల ఆధిక్యంతో మహాఘట్ బంధన్ మీద పైచేయి సాధించినట్లు పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడయ్యింది. నితీష్ కుమార్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళా రోజ్‌గార్ యోజన పథకం కింద కోటి 25 లక్షల మంది మహిళలకు రూ.10 వేల నగదు పంపిణీ చేయడం ఎన్డీఏ భారీ మెజారిటీ సాధించడానికి దోహదపడింది.

ఎన్డీయే కూటమికి 46.2 శాతం ఓట్లు, మహాఘట్ బంధన్ కు 37.9 శాతం, నూతనంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి 9.7 శాతం, ఇతరులకు 6.2 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది ఈ సర్వే ఫలితాల్లో మూడు శాతం 'ప్లస్ ఆర్ మైనస్' ఉండే అవకాశాలు ఉంటాయి

243 స్థానాలు ఉన్న బిహార్ శాసనసభలో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 122 కాగా, ఎన్డీయే కూటమికి 133-159 స్థానాలు, మహాఘట్ బంధన్ కూటమికి 75-101 స్థానాలు, ఇతరులకు 2 నుంచి 8 స్థానాలు, నూతనంగా ప్రారంభించిన జన్ సురాజ్ పార్టీకి 0-5 స్థానాలు వచ్చే అవకాశం ఉంది

**టైమ్స్ నౌ**

ఎన్డీయే 135-150 సీట్లు
మహాఘట్ బంధన్ 83-105 సీట్లు
జన్ సురాజ్ పార్టీ (ప్రశాంత్ కిషోర్ పార్టీ)-1 సిటు
ఇతరులు 3-6 సీట్లు

**దైనిక్ భాస్కర్**

ఎన్డీయే 145-160 సీట్లు
మహాఘట్ బంధన్ 79-91 సీట్లు
జన్ సురాజ్ పార్టీ (ప్రశాంత్ కిషోర్ పార్టీ)-0 సిటు
ఇతరులు 5-10 సీట్లు

**ఎస్ఏఎస్ గ్రూప్**

ఎన్డీయే 126-130 సీట్లు
మహాఘట్ బంధన్ 106-110 సీట్లు
జన్ సురాజ్ పార్టీ (ప్రశాంత్ కిషోర్ పార్టీ)-7-10 సిట్లు
ఇతరులు 4-6 సీట్లు

# జడ్జీలపై ఆరోపణలు చేయడం ట్రెండ్‌గా మారింది

**న్యూఢిల్లీ:** తమకు అనుకూలంగా తీర్పులు రాని పక్షంలో లాయర్లు, కక్షిదారులు న్యాయమూర్తులపై అవమానకరమైన, అశ్లీలతతో కూడిన ఆరోపణలు చేయడం నేడు ట్రెండ్‌గా మారిపోయిందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి పరిణామాలు న్యాయవ్యవస్థ సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తాయని, వీటిని అడ్డుకోవాలనిప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. తెలంగాణకు చెందిన కక్షిదారు పెద్ది రాజు, అతడి తరఫున వాదించిన ఇద్దరు లాయర్లపై ధిక్కార చర్యలను నిలిపివేస్తూ ఈ మేరకు పేర్కొంది. ఈ ముగ్గురూ తెలంగాణ హైకోర్టుకు క్షమాపణలు చెప్పడం, న్యాయస్థానం అంగీకరించడం జరిగినందున మళ్లీ విచారణ అవసరం లేదని తెలిపింది. అదేవిధంగా, న్యాయస్థానపు అధికారులుగా ఉన్న లాయర్లు ఈ కోర్టు లేదా ఏ హైకోర్టు న్యాయమూర్తులపై అయినా ఆరోపణలు చేసే పిటిషన్‌దారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. తెలంగాణ హైకోర్టుకు చెందిన జస్టిస్ మౌసుమి భట్టాచార్యపై పెద్ద రాజు, అతడి ఇద్దరు లాయర్లు అనుచిత వ్యాఖ్యలు చేయడం వివాదం రేపింది.



**న్యాయవ్యవస్థలో ఏఐపై మార్గదర్శకాలు: సుప్రీం**

కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత దుర్వినియోగం అవుతుండటంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు గదిలో విచారణ జరుగుతున్న సమయంలో తనపై ఓ లాయర్ షూ విసిరేసిన ఘటనను తప్పుగా చూపిస్తున్న ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగంపై మార్గదర్శకాలు జారీ చేయాలంటూ అభినవ్ శ్రీవాస్తవ అనే లాయర్ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో వాదనలు వింటామన్నారు. వివిధ అంశాలను ఏఐ వ్యవస్థలతో కావాల్సిన విధంగా మల్చుకునే ప్రమాదముందని పిటిషనర్ హెచ్చరించారు. ఏఐ వినియోగంతో అనేక అనూహ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. న్యాయవ్యవస్థ, న్యాయ విధులకు సంబంధించినంత వరకు ఏఐ నిష్పాక్షిక డేటాను కలిగి ఉండాలని, జవాబుదారీతనంతో కూడిన డేటా యాజమాన్యం పారదర్శకంగా ఉండాలని పిటిషన్ పేర్కొంది. లేకుంటే సైబర్ దాడుల ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించింది. అక్టోబర్ 6వ తేదీన రాకేశ్ కిశోర్ అనే లాయర్ విచారణ జరుగుతున్న సమయంలో సీజేఐ వైపు షూ విసరడం తీవ్ర కలకలం రేపింది.

# ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ భారీ పేలుడుతో దద్దరిల్లింది. మంగళవారం నాడు నగరంలోని జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలో జరిగిన శక్తిమంతమైన పేలుడులో కనీసం 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని పాక్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇది ఆత్మాహుతి దాడి అని భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కోర్టు గేటు వద్ద పార్క్ చేసి ఉన్న ఓ కారులో ఈ పేలుడు సంభవించింది. ఇది అత్యంత రద్దీగా ఉండే సమయం కావడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, కారులోని గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని భావిస్తున్నా, ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండొచ్చని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల పార్క్ చేసిన అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. సుమారు 6 కిలోమీటర్ల దూరం వరకు పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు తెలిపారు. "నేను నా కారు పార్క్ చేసి కాంప్లెక్స్‌లోకి వెళుతుండగా, గేటు దగ్గర పెద్ద శబ్దం వినిపించింది. అక్కడ రెండు మృతదేహాలు పడి ఉన్నాయి.



అనేక కార్లు మంటల్లో కాలిపోతున్నాయి" అని రుస్తుమ్ మాలిక్ అనే న్యాయవాది ఏఎఫ్‌పీ వార్తా సంస్థకు వివరించారు. ఈ ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**పెషావర్ తరహా దాడికి కుట్ర భగ్నం**


ఈ పేలుడుకు కొన్ని గంటల ముందే దక్షిణ వజీరిస్థాన్‌లో పాక్ భద్రతా దళాలు ఓ ఉగ్రకుట్రను భగ్నం చేశాయి. వానాలోని కేడెట్ కాలేజీపై తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు చేయబోయిన దాడిని భద్రతా దళాలు అడ్డుకుని, ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాయి. 2014లో పెషావర్‌లోని ఆర్మీ స్కూల్‌పై జరిగిన తరహా దాడినే పునరావృతం చేయాలని ఉగ్రవాదులు ప్రయత్నించారని పాక్ సైన్యం వెల్లడించింది. ఆనాటి దాడిలో 154 మంది ప్రాణాలు కోల్పోయారు. గత కొంతకాలంగా పాకిస్థాన్ టీటీపీ ఉగ్రవా దుల నుంచి తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత పాక్‌లో టీటీపీ కార్యకలాపాలు పెరిగాయి. టీటీపీ నాయకులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తుండటంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

## సహకార రుణ రంగాన్ని విస్తరించడమే లక్ష్యం

పట్టణ సహకార రుణ రంగాన్ని విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. దేశ రాజధానిలో జరిగిన 'అర్బన్ కోఆపరేటివ్ క్రెడిట్ సెక్టార్, కో-ఆప్ కుంభ్ 2025' అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలోని 2,00,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పట్టణంలో వచ్చే ఐదేళ్లలో ఒక సహకార బ్యాంకు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. అర్బన్ కో-ఆపరేటివ్ సెక్టార్‌లో ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇవ్వడాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్‌షా చెప్పారు. భాగస్వామ్య యాజమాన్య నమూనా ఆధారంగా వ్యాపారాన్ని విస్తరించే లక్ష్యంలో భాగంగా ఈ సదస్సులో రూపొందించిన 'ఢిల్లీ డిక్లరేషన్ 2025' రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**ఎన్‌పీఏల తగ్గింపు**

గత రెండేళ్లలో పట్టణ సహకార బ్యాంకుల నిరర్థక ఆస్తులు గణనీయంగా తగ్గాయని అమిత్‌షా హైలైట్ చేశారు. గత రెండేళ్లలో ప్రభుత్వం ఎన్‌పీఏను 2.8 శాతం నుంచి 0.6 శాతానికి తగ్గించేందుకు ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. సహకార రంగంలోని రుణదాతలు ఆర్థిక డిజిటల్ సాంకేతి కతలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'సహకార్ డిజీ-పే', 'సహకార్ డిజీ-లోన్' యాప్‌లు డిజిటల్ విప్లవంలో సహకార రంగం భాగస్వామ్యానికి గుర్తింపు ఇవ్వనున్నాయని చెప్పారు.



**యువత, బలహీన వర్గాల సాధికారత కోసం..**

యువ పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక బృందాలు, సమాజంలోని బలహీన వర్గాల సాధికారత కోసం పట్టణ సహకార బ్యాంకులు చర్యలు చేపట్టాలని మంత్రి సూచిం చారు. 'సహకార సంఘాలను బలోపేతం చేయడం, అదే సమయంలో బలహీన వర్గాలకు దన్నుగా నిలవడం మా లక్ష్యం. పట్టణ సహకార బ్యాంకులు తప్ప మరే సంస్థ దీన్ని సాధించలేదు' అని ఆయన నొక్కి చెప్పారు. ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించడానికి ఈ రంగాన్ని విస్తరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయంలో ఉమ్మడి విధానాన్ని రూపొందించాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు.

**సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సహకార రంగాన్ని డిజిటలైజ్ చేయడానికి, ఈ విభాగంలో సేవలు విస్తరించడానికి కేంద్రం అనేక మార్పులను తీసుకువచ్చింది. జులై 2021లో మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి అమిత్ షా నేతృత్వంలో సహకార మంత్రిత్వ శాఖను సృష్టించింది. జాతీయ స్థాయి సహకార సంఘాల పాలనను మెరుగుపరచడానికి గత సంవత్సరం పార్లమెంటు బహుళ-రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) చట్టం, 2022ను కూడా ఆమోదించింది.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్



ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో మంగళవారం మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు ధ్రువీకరించారు. ఇప్పటి వరకు ఆరుగురు మావోలు మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భద్రతా దళాల బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో పాల్గొందని.. ఈ సమయంలో అక్కడ దాక్కున్న మావోయిస్టులు కాల్పులు జరిపారని.. భద్రతా దళాలు దీటుగా బదులిచ్చాయని ఎస్పీ పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి కాల్పులు జరుగుతున్నట్లుగా ఆయన వివరించారు. డీఆర్‌జీ బీజాపూర్, దంతేవాడ, ఎస్‌టీఎఫ్ సంయుక్త బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారన్నారు. సెర్చ్ ఆపరేషన్ సమయంలో సంఘటనా స్థలంలో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇన్సాస్, స్టెన్‌గన్, 303 రైఫిల్స్‌తో పాటు ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పీ మాట్లాడుతూ డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్, సీఏఎఫ్ దళాలను చుట్టుపక్కల ప్రాంతాలకు పంపినట్లు ఐజీ పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డ నలుగురు నక్సల్స్‌ను సంఘటనా స్థలంలోనే అరెస్టు చేసినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ పేర్కొన్నారు. సంఘటనా స్థలంలోనే వారికి చికిత్స అందించి.. అంబులెన్స్ ద్వారా బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

## ప్రమాదంలో ఢిల్లీ.. కేంద్రం కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణ పరిస్థితులు తీవ్ర ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. ఈ రోజు ఉదయం గాలి నాణ్యత పూర్తిగా క్షీణించి (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్)లో 425కి చూపించడంతో కేంద్రం తక్షణ చర్యలకు ఉపక్రమించి నిషేదాజ్ఞాలు విధించింది. ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపింది.

**పూర్తిగా క్షీణించిన గాలినాణ్యత**

ఢిల్లీ అంటేనే గాలి కాలుష్యానికి మారుపేరులా మారింది. చలి కాలంలో ఆ తీవ్రత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఢిల్లీలో ఉన్న ప్రత్యేక వాతావరణ పరిస్థితులతో పాటు అధిక స్థాయిలో వాహనాలు వాడడం, పంట వ్యర్థాలను కాల్చివేయడం, తదితర కారణాలతో ఆ ప్రాంతంలో తరచుగా గాలి నాణ్యత క్షీణిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 362 గా ఉన్న గాలి నాణ్యత మంగళవారం ఉదయం మరింతగా క్షీణించి 425కు చేరి తీవ్ర ప్రమాదకర స్థాయికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన కేంద్రం పలు నిషేదాజ్ఞాలు జారీ చేసింది.

అత్యవసరమయితే తప్ప నిర్మాణాలు చేపట్టడం లేదా కూల్చివేయడం నిషేదమని తెలిపింది.

రాజధాని పరిసర ప్రాంతాలలోని అన్ని మైనింగ్ కార్యక్రమాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది.

బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డిజీల్ వాహనాలు రోడ్లపై తిరగడం నిషేదం.( దివ్యాంగులకు మినహాయింపు)

5వ తరగతి వరకూ పాఠశాలలు హైబ్రీడ్ మోడల్ లో క్లాసులు నిర్వహించాలని తెలిపింది. వీలైతే విద్యార్థులు క్లాసులు ఆన్?లైన్ మోడల్?లో వినాలని సూచించింది.

ఎయిర్ క్యాలిటీ ఇండెక్స్ కొలతలు
స్టేజ్-1 తక్కువ (200-300)
స్టేజ్-2 మరింత తక్కువ (301-400)
స్టేజ్-3 ప్రమాదకరస్థాయి (401-450)
స్టేజ్-4 తీవ్రప్రమాదకరం( 450 ప్లస్)

## ఢిల్లీ పేలుడు కేసు ఎన్ఐఏకి అప్పగింత



రాజధాని ఢిల్లీలో పేలుడుతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నిత్యం రద్దీగా ఉండే చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర ఉన్న సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 12 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 17 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక ఈ పేలుడు కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించారు. పేలుడు ఘటనపై ఎన్ఐఏ త్వరలో నివేదిక ఇవ్వనుంది. మరోవైపు పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. నిన్న తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇవాళ మరో ముగ్గురు మరణించినట్లు ఢిల్లీ పోలీసులు మంగళవారం ప్రకటించారు. దీంతో పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 12కి పెరిగింది. ఇదిలా ఉండగా.. పేలుడు ఘటనపై యూఏపీఏ చట్టం కింద ఢిల్లీ పోలీసులు కేసు బుక్ చేశారు. కోత్వాలి పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16, 18 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కూడా కేసులు బుక్ చేశారు. ప్రస్తుతం పలు ప్రదేశాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దేశ రాజధాని హై అలర్ట్‌లో ఉన్నది. ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్, బస్ టర్మినల్ల వద్ద బందోబస్తు పెంచారు.

# నిర్లక్ష్యమే ప్రాణం తీసిందా

**హైదరాబాద్ :** అందెశ్రీ అకస్మాత్తుగా చనిపోవడం యావత్ తెలంగాణ మొత్తంగ్రాభ్రాంతికి గురైంది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి మొదలుపెడితే ఉద్యమకారుల వరకు కన్నీరు పెడుతున్నారు.. ఈ దారుణమైన పరిణామాన్ని తట్టుకోలేక నిర్వేదంలో మునిగిపోయారు. వాస్తవానికి అందెశ్రీ చనిపోవడం నిజంగా ఒక షాకింగ్ లాంటి వార్త. ఆరోగ్యంగా ఉన్న అందెశ్రీ.. ఉన్నట్టుండి ఎందుకు కుప్పకూలిపోయారు.. కుటుంబ సభ్యులు చూస్తుండగానే ఎందుకు చనిపోయారు? ఇప్పుడు ఈ ప్రశ్నలే సగటు తెలంగాణ వాదిని తొలుస్తున్నాయి. గాంధీ హాస్పిటల్ హెచ్వోడి సునీల్ కుమార్ అందెశ్రీ మృతికి సంబంధించి కీలక విషయాలను వెల్లడించారు.. అందెశ్రీ ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాలని ఆయన పేర్కొన్నారు. అందెశ్రీ గడిచిన ఐదు సంవత్సరాలుగా హైపర్ టెన్షన్ తో ఇబ్బంది పడుతున్నారు.. ఒక నెల నుంచి ఆయన మందులు సరిగ్గా వాడడం లేదు. మందులు సరిగ్గా వాడకపోవడం వల్ల ఆయాసంతో ఇబ్బంది పడుతున్నారు.. చాతి భాగంలో కూడా ఆయనకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. వ్యక్తిగత ఆరోగ్య విషయంలో అందెశ్రీ నిర్లక్ష్యాన్ని కొనసాగించడం వల్లే చనిపోయారని సునీల్ కుమార్ పేర్కొన్నారు..ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అందెశ్రీ మామూలుగానే పడుకున్నారు.. ఉదయం లేచి చూసేసరికి బాత్రూం వద్ద కింద పడిపోయారు.. అయితే ఆ రాత్రి ఏం జరిగిందనేది కుటుంబ సభ్యులకు తెలియదు.. సోమవారం తెల్లవారుజామున 6 గంటల 20 నిమిషాల ప్రాంతంలో కుటుంబ సభ్యులు అందశ్రీని కుటుంబ సభ్యులు గమనించారు.. వెంటనే గాంధీ ఆసుపత్రికి తీసుకువచ్చారు.. అందెశ్రీని పరీక్షించిన గాంధీ ఆసుపత్రి ఆర్ ఎం వో చనిపోయాడని నిర్ధారించారు.. అయితే ఆయన చనిపోయి అప్పటికే ఐదు గంటలు కావచ్చని గాంధీ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు..తనకు అనారోగ్యంగా ఉన్నప్పటికీ కూడా వైద్యులను సంప్రదించకుండా అందెశ్రీ నిర్లక్ష్యం చేశారని.. గత నెల రోజులుగా ఆయన బీపీ మాత్రలు వేసుకోవడం లేదని వైద్యులు పేర్కొన్నారు.. వ్యక్తిగత ఆరోగ్యాన్ని అందెశ్రీ పరిరక్షించుకుంటే ఇక్కడ దాకా వచ్చేది కాదని గాంధీ



ఆసుపత్రి వైద్యులు వివరించారు.. ఆయన ప్రతిరోజు నడకకు వెళ్లేవారని.. ఇదే క్రమంలో బీపీ మాత్రలు వేసుకొని ఉంటే పరిస్థితి ఇక్కడ దాకా వచ్చేది కాదని వైద్యులు పేర్కొంటున్నారు.. బీపీ మాత్రలు వేసుకోకపోవడం వల్ల హఠాత్తుగా గుండెపోటు వచ్చి ఉంటుందని.. అందువల్లే అందెశ్రీ చనిపోయారని వైద్యులు చెబుతున్నారు. హైపర్ టెన్షన్ ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడాలి.. మందులు వాడే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సరే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.

**కలల సౌధం పూర్తికాకుండానే**

తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' రచయిత, ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం సాహితీ లోకాన్ని, రాజకీయ వర్గాలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. అన్నిటికంటే బాధాకరం ఏంటంటే... ఆయన ఎంతో ఇష్టంతో, ఆశగా నిర్మించుకుంటున్న తన 'కలల సౌధం' పూర్తి కాకముందే ఈ లోకాన్ని విడిచివెళ్లడం. కొన్ని రోజుల్లోనే ఆ కొత్త ఇంట్లోకి అడుగుపెట్టాలనుకున్న ఆయన కోరిక నెరవేరలేదు.అందెశ్రీ తన జీవిత చరమాంకంలో కొత్త ఇంటి నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన సందర్భంగా.. ఆయనకు కోటి రూపాయల నజరానాతో పాటు, ఇంటి నిర్మాణానికి అవసరమైన 348 గజాల స్థలాన్ని కూడా బహుకరించింది. ఆయన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్.ఎఫ్.సి. నగర్ లోని ఆ స్థలంలో ఉ+3 పెంట్ హౌస్ నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. అందెశ్రీకి ఆ ఇంటి నిర్మాణంపై ఎంత మమకారం ఉందంటే.. చనిపోయే ముందు రోజు 2025, నవంబర్ 09వ తేదీ సాయంత్రం వరకు ఆయన అక్కడే గడిపారు. తానే స్వయంగా దగ్గర ఉండి నిర్మాణ పనులను పర్యవేక్షించి వెళ్లినట్లు మేస్త్రీలు, కాంట్రాక్టర్లు , కుటుంబ సభ్యులు తెలిపారు.

# సెహభాష్... తెలంగాణ పోలీస్


**హైదరాబాద్ :** మనం అనేక సందర్భాల్లో చెప్పుకున్నాం కదా.. పోలీసుల మీద రాజకీయ ఒత్తిడి లేకుంటే.. పోలీసులను వారి పని వారిని చేసుకొనిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని.. అసాంఘిక శక్తుల ఆటలు సాగవని.. సంఘవిద్రోహశక్తుల దుర్మార్గాలు ముందుకెళ్లవని.. అలాంటి పనిని తెలంగాణ పోలీసులు చేసి చూపించారు. యావత్తు దేశం మొత్తం తమ వైపు చూసుకునేలా చేశారు.నేటి స్మార్ట్ కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దుర్మార్గులు రకరకాల విధాలుగా ప్రజలను మోసం చేస్తున్నారు.. మెసేజ్లు పంపించడం.. లింకులు సెండ్ చేయడం.. డిజిటల్ అరెస్టులు.. మాదక ద్రవ్యాలు దొరికాయని చెప్పడం.. ఇలా రకరకాల విధానాల్లో మోసాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు.. ఇలా అమాయకులను మోసం చేస్తే కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. పైగా ఈ డబ్బులను రకరకాల విధానాలలో మార్చేస్తూ తమ వద్దకు తెచ్చుకుంటున్నారు. ఇలా దొంగిలించిన డబ్బులను మ్యూల్ ఖాతాల సహాయంతో తమ వద్దకు తెచ్చుకుంటున్నారు.. అయితే ఈ తరహా మోసాలు ఇటీవల అధికంగా పెరగడంతో తెలంగాణ సైబర్ పోలీసులు దృష్టి సారించారు. అంతే కాదు సరికొత్త ఆపరేషన్ చేసి యావత్ దేశం మొత్తం తమ వైపు చూసేలా చేశారు.తెలంగాణ పోలీసులకు ఇటీవల కాలంలో సైబర్ ఫిర్యాదులు పెరిగిపోయాయి. తెలంగాణ సైబర్ పోలీసులు ఎన్ని విధాలుగా అవగాహన కల్పించినప్పటికీ నేరాలు తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల తమకు అందిన ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ సైబర్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.. అయితే ఈ తీగను తెలంగాణలో లాగితే ఐదు రాష్ట్రాల్లో డొంక కదిలింది.. 95 కోట్ల స్కాం బయటపడింది.. అంతేకాదు 81 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.. తెలంగాణలో వచ్చిన సైబర్ మోసంపై పోలీసులు దర్యాప్తును మొదలుపెట్టారు.. మోసానికి




పాల్పడిన వ్యక్తులు మొత్తం కూడా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకలో ముఠాలుగా ఏర్పడ్డారని పోలీసుల విచారణలో తేలింది. ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు నిర్వహించింది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు.నిందితుల నుంచి పోలీసులు 84 సెల్‌ఫోన్లతో పాటు 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నారు.అంతేకాదు 81 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై 754 కేసులు ఉన్నాయి. 95 కోట్ల విలువైన మోసాలకు వీరు పాల్పడ్డారు. వారి వద్ద నుంచి 84 ఫోన్లు, 101 సిమ్ లు, 89 బ్యాంకు పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు వారి ఖాతాలో ఉన్న కోట్ల నదులు మొత్తం ఫ్రీజ్ చేశారు.. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసుల ఆపరేషన్లలో ఇది అతి పెద్దదని తెలుస్తోంది.

# ఆ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

**హైదరాబాద్ :** అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద హైదరాబాద్‌లోని ఉందానగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ. 12.37 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 79 శాతం పనులు పూర్తయ్యాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. స్టేషన్ భవనం విస్తరణ, వెయిటింగ్ హాల్, పే అండ్ యూజ్ టాయిలెట్స్ వంటి నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ స్టేషన్ హైదరాబాద్ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటం వల్ల ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా.. ఆధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న 40 తెలంగాణ రైల్వే స్టేషన్లలో ఉందానగర్ రైల్వే స్టేషన్ ఒకటి. ఉందానగర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి మొత్తం రూ. 12.37 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తయినట్లు



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సోమవారం తన ట్వీట్‌లో పేర్కొన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న ఈ పనుల ద్వారా ఉందానగర్ స్టేషన్‌లో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. పునరాభివృద్ధి పనుల్లో భాగంగా స్టేషన్ భవనం విస్తరణ , మెరుగైన ప్రయాణికుల వెయిటింగ్ హాల్ , పే అండ్ యూజ్ టాయిలెట్స్ , సురక్షితమైన పార్కింగ్ షెడ్లు , ఎగ్జిట్ ఆర్చ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. ప్లాట్‌ఫామ్-01 వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం కూడా ముగించారు. వెయిటింగ్ హాల్‌లో రూఫ్ స్లాబ్, ప్లాస్టర్ పనులు పూర్తి కాగా, స్టేషన్ భవనం విస్తరణలో విండోస్, గ్రానైట్, గ్రిల్ ఫిక్సింగ్ పనులు పూర్తి చేశారు. పార్కింగ్ షెడ్లకు సంబంధించిన ఫౌండేషన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.ఉందానగర్ రైల్వే స్టేషన్‌కు వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉంది. ఇది హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉంది. ముఖ్యంగా.. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల.. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ఇది కీలక రవాణా కేంద్రంగా మారనుంది.అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా కేవలం సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా.. ఉందానగర్ వంటి స్టేషన్లు ప్రాంతీయ అనుసంధానతను పెంచడానికి.. స్థానిక ఆర్థిక వ్యవస్థల వృద్ధికి దోహదపడతాయి. ఈ పునరాభివృద్ధి పనులు పూర్తయితే.. ఈ స్టేషన్ రైల్వే ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని ఇవ్వడంతో పాటు.. తెలంగాణలో రైల్వే ఆధునికీకరణకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

## అందెశ్రీ పాటలతో ప్రజల్లో స్ఫూర్తి



-మొదటిపేజీ తరువాయి

ఆయన రాసిన ప్రతీ పాట తెలంగాణలో స్ఫూర్తిని నింపిందని కీర్తించారు. అందుకే ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటామని మాటిచ్చారు. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఆయన పాటల సంకలనం 'నిప్పుల వాగు' తెలంగాణ సమస్యలపై పోరాడేవారికి గైడ్‌గా ఉపయోగపడుతుందని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి.

అందుకే 20 వేల పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతీ లైబ్రరీలో 'నిప్పుల వాగు' ను అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని గుర్తుచేశారు. ఈ విషయంపై ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తామని పేర్కొన్నారు. వారికి పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ సహకరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున అందెశ్రీని పద్మశ్రీతో గౌరవించడానికి కేంద్రమంత్రులు కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

కాగా, ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పార్థివ దేహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈరోజు (మంగళవారం) ఘట్‌కేసర్ చేరుకున్న సీఎం.. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరయ్యారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఆయన సతీమణిని ఓదార్చారు. అందెశ్రీ పాడెను సీఎం రేవంత్ మోశారు. లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమయాత్ర సాగింది.

అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం: సీఎం రేవంత్

"తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించిన వ్యక్తి అందెశ్రీ. వారిని కోల్పోవడం తెలంగాణ సమాజంతో పాటు వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనను కలిసి తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి మీ పాత్ర ఉండాలని కోరా. గద్దర్ అన్నతో పాటు అందెశ్రీ కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఆయన రాసిన ప్రతీ పాట తెలంగాణలో స్ఫూర్తిని నింపింది .అందుకే ఆయన రాసిన "జయ జయహే తెలంగాణ" గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటాం. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తాం. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఆయన పాటల సంకలనం "నిప్పుల వాగు" ఒక భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా తెలంగాణ సమస్యలపై పోరాడేవారికి గైడ్‌గా ఉపయోగపడుతుంది. అందుకే 20 వేల పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతీ లైబ్రరీ లో ఆ పుస్తకాన్ని అందుబాటులో ఉంచుతాం" అని సీఎం రేవంత్ తెలిపారు.

## జూబ్లీహిల్స్ హస్తందే!

-మొదటిపేజీ తరువాయి



బీజేపీకి 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. హెచ్ఎంఆర్ సర్వే ఎగ్జిట్?పోల్ ఫలితాల ప్రకారం కాంగ్రెస్‌కు 48.3శాతం, బీఆర్ఎస్?కు 43.18శాతం, బీజేపీకి 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముందని అంచనా వేసింది. స్మార్ట్ పోల్ సర్వే ప్రకారం కాంగ్రెస్‌కు 48.2శాతం, భారత రాష్ట్ర సమితికి 42.1 శాతం, బీజేపీ 7.6 శాతం, ఇతరులకు 2.1శాతం ఓట్లు పోలయ్యే అవకాశముందని తెలిపింది. సాయంత్రం ఐదు గంటల వరకు 48.42 శాతం పోలింగ్ నమోదయ్యింది.

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో త్రిముఖ పోటీ**

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు దివంగత మాగంటి గోపీనాథ్ మృతితో ఉపఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలో 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ త్రిముఖ పోటీ నెలకొంది. బీఆర్ఎస్? పార్టీ తరఫున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, కాంగ్రెస్ పార్టీ తరఫున నవీన్ యాదవ్, బీజేపీ తరఫున లంకల దీపక్? రెడ్డిలు పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికను అధికార పార్టీ, ప్రతిపక్షాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు, ఓటర్లు ఇచ్చే తీర్పుపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

**మొత్తం 4,01365 మంది ఓటర్లు**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,01365 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 2,85061 మంది పురుషులు, 1,92779 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 25 మంది, సర్వీసు ఓటర్లు 18, ఎన్?ఆర్ఐ ఓటర్లు 123, దివ్యాంగులు 1,908 ఉన్నారు. 18 నుంచి 19 ఏళ్లు ఉన్న ఓటర్లు 6,859 మంది ఉండగా 80ఏళ్లు పైబడిన వారు 6,053 మంది 85ఏళ్లు పైబడిన వారు 2,134 మంది ఓటర్లు ఉన్నారు.

**గత ఎన్నికల్లో ఎంతశాతం పోలింగ్ నమోదయ్యిందంటే?**

జూబ్లీహిల్స్?లో పోలింగ్? శాతమనేది కీలకంగా మారింది. గత ఎన్నికల సరళిని పరిశీలించినట్లయితే ఎప్పుడూ కూడా 50 శాతం దాటలేదు. 2024లో 45.59 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2023లో 47.58 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అదే 2019 సంవత్సరంలో 39.89 శాతం, 2018లో 45.59 శాతం, 2014లో 50.18 శాతం ఓటింగ్? శాతం నమోదు అయింది. ఈ నియోజకవర్గంలో మొత్తం 4 లక్షల ఓట్లు ఉన్నాయి. ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధాకారులు అదనంగా 1 గంట సమయాన్ని పొడిగించారు. ఇవాళ జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సాయంత్రం ఐదు గంటల వరకు 48.42 శాతం పోలింగ్ నమోదయ్యింది.

## తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలో వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ రెవిన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8662 ఇండ్లు దెబ్బతినగా.. వీరికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు. కాగా.. అక్టోబర్ 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కోతగూడెం, నల్గొండ జిల్లాలు భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే.


# రోడ్డు వేశారు క్యూరింగ్ మరిచారు..

పర్యవేక్షణ లోపం కారణంగానే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
ఇష్టానుసారంగా రోడ్ల నిర్మాణం పట్టించుకోని? అధికారులు
అయిదు రోజులైనా క్యూరింగ్? నిల్?..

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్:** షాద్? నగర్? మున్సిపాలిటీని జిల్లాలో ఆదర్శంగా నిలిపేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్? కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా గతంలో ఎన్నడు లేని విధంగా పట్టణంలోని కాలనీలలో సీసీ రోడ్లకు భారీ ఎత్తున నిధులు తీసుకొచ్చారు. నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్? నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పుడు మున్సిపాలిటీకి చెందిన ఏఈ, కానీ వర్క్? ఇన్స్?పెక్టర్లు పరిశీలించడం లేదన్న బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మికులు ఇష్టానుసారంగా సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నారని, వర్షపు నీరు వెళ్లేందుకు వీలులేకుండా కొన్ని కాలనీలలో రోడ్ల నిర్మాణం చేపట్టారన్న ఆరోపణలున్నాయి.

**రోడ్డు వేశారు...క్యూరింగ్ మరిచారు...**

పట్టణంలో నిర్మిస్తున్న రహదారుల క్యూరింగ్? సరిగ్గా చేయడంలేదని పలు కాలనీలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. తిరుమల మెఘా టౌన్? షిప్? కాలనీలో గత అయిదు రోజుల క్రితం సీసీ రోడ్డు వేశారు. కానీ, దానికి మళ్ళీ తిరిగి చూసే నాథుడే కరువు అయ్యారు. సీసీ రోడ్డుపై కట్టలు కట్టి క్యూరింగ్ చేపట్టాలి అలా చేపడితేనే రోడ్డు నాణ్యతగా ఉంటుంది.ఇంత వరకు రోడ్డు వేసి రోజులు గడుస్తున్న కూడా క్యూరింగ్ జరగకపోవడంతో.. రోడ్డు వేశామా అంటే వేశాం అన్నట్లుగా రోడ్డు వేసి నిర్లక్ష్యంగా వదిలేశారు. పట్టణంలో వేసిన సీసీ రోడ్లపై మున్సిపల్? శాఖ అధికారులు పర్యవేక్షించకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కాంట్రాక్టర్ రోడ్డు వేసి క్యూరింగ్ చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే కాలనీలో కొంత భాగం రోడ్డుపై కట్టలు కట్టారు కానీ నీటిని పట్టలేదు. కాంట్రాక్టర్? నిర్లక్షం, మున్సిపల్? ఇంజనీరింగ్? అధికారుల పర్యవేక్షన లోపంతో పట్టణంలో కొత్తగా వేసిన సీసీ రోడ్లు మూణ్ణాళ్ల ముచ్చటగానే మారనున్నాయని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై సీడీ,ఏంఏ, ప్రజారోగ్య ఇంజనీరింగ్? విభాగం ఈఎన్?సీ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్? చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు ధీనంగా



వేడుకుంటున్నారు..

# మృత్యువు ఒడిలా తయారైన షాద్నగర్ పట్టణ చౌరస్తా

ప్రస్తుతం ఉన్న రోడ్లు ఏమాత్రం సరిపోని పరిస్థితి
షాద్నగర్ చౌరస్తాలో నాలుగు వైపుల నుండి నడిచే పాదాచారులకు వెంటనే పై వంతెనలు నిర్మించాలి
షాద్నగర్ పట్టణంలో నాలుగు వైపులా కూడా రోడ్డు విస్తరణ తప్పక చేయాల్సిందే
మఠం ఋషికేష్ బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు






**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** 20 సంవత్సరాలకు క్రితం షాద్నగర్ ఇప్పుడున్న షాద్నగర్కు జనాభా పదింతలు పెరిగింది కాలానుగుణంగా జనాభా, వాహనాల రద్దీ స్కూల్లు, కాలేజీలు, బస్సులు, లారీలు వంటి ఎన్నో వాహనాలు నిత్యం రద్దీగా వెళ్తూ ఎన్నో యాక్సిడెంట్ పాలవుతున్న పరిస్థితి అలాగే హైదరాబాద్ నగరానికి కూత వేటు దూరంలో ఉన్నాం, ప్రతి కుటుంబంలో రెండు బైకులు ఒక కారు ఉండనే ఉన్నాయి కానీ వాటికి అనుగుణంగా రోడ్డు విస్తరణ,పైవంతనలు, ట్రాఫిక్ సిగ్నల్ ను పాటించడం వంటి ఎన్నో ఆధునీకరణకు అలవాటు పడని ప్రజానికం నేనంటే నేను ముందుగా వెళ్లాలని తొందరపాటు, అందులో రోడ్డు దాటే విద్యార్థులు, వ్యాపారస్తులు, లారీలు, మరెన్నో హెవీ లోడ్ వెహికల్స్ నిత్యం చౌరస్తాలో కనిపిస్తున్నాయి వాటన్నిటినీ దాటుకొని మనిషి రోడ్డు దాటడమంటే కత్తి మీద సాములాంటి పని ఎక్కడ చూసిన నిత్యం రద్దీగా ఉండే షాద్నగర్ పట్టణ చౌరస్తా వీధి వ్యాపారస్తులు, ఆటో జిప్ వాలాలు, ఇలా ఎన్నో రకాల వాహనాలు ప్రయాణించే సమయంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో దుర్ఘటనలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోయారు కావున ఆర్ అండ్ బి, షాద్నగర్ ఎమ్మెల్యే గారు, ట్రాఫిక్ పోలీస్ అధికారులను మరియు ఇతర ప్రభుత్వ అధికారులు వెంటనే ఈ యొక్క షాద్నగర్ ట్రాఫిక్ అంశంపై చొరవ చూపి రోడ్డు యాక్సిడెంట్ బారిన పడకుండా ప్రజలను కాపాడాలని, హైదరాబాద్ నుండి మహబూబ్నగర్ రోడ్డువైపు కొత్త రోడ్డు వేసినా కూడా కొన్ని మరమ్మతుల కారణంగా మళ్ళీ గుంతలు ఏర్పడి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి కావున ప్రభుత్వం వెంటనే అంశంపై చర్చకు జరిపి పాదాచారులకు పై వంతెనలు నిర్మించేలా ప్రణాళిక చేపట్టాలని బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేష్ తమ యొక్క ప్రకటన ద్వారా తెలియజేశారు....

# సుమనమ్మ యాదిలో శిష్యులు,కుటుంబ సభ్యులు.





బూర్గుల మదిలో సుమనమ్మ..
ప్రగతి రూరల్ డెవలప్మెంట్ సెంటర్ లో ఘన నివాళులు..
హాజరైన పూర్వ విద్యార్థి డాక్టర్ అలోక్ అగర్వాల్,కుటుంబ సభ్యులు.

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** ప్రముఖ సంఘ సేవకురాలు బూర్గుల సుమన స్ఫూర్తి సంస్మరణ సభ బూర్గుల గ్రామంలోని ప్రగతి రూరల్ డెవలప్మెంట్ సెంటర్లో నిర్వహించడం జరిగింది..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుమనమ్మ పూర్వ విద్యార్థి ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ అలోక్ అగర్వాల్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు...అలాగే సుమనమ్మ కుటుంబ సభ్యులు తమ్ముడు బూర్గుల ప్రదీప్ కుమార్, అంబిక, చిన్న చెల్లెలు అరుణమ్మ, డాక్టర్ అనుపమ, బూర్గుల రామకృష్ణారావు మనుమడు లక్ష్మీకాంతం, బూర్గుల వేణుగోపాల్ రావు దంపతులు తదితరులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు .ప్రగతి వెల్ఫేర్ సొసైటీ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యాలరీలో సుమనమ్మ ప్రగతి వెల్ఫేర్ సొసైటీ తో కలిసి చేసిన కార్యక్రమాలను ఆధ్యాంతం ఉమ్మడి బూర్గుల గ్రామ ప్రజలు తిలకించారు.ఈ కార్యక్రమానికి హాజరైన వారికి సుమనమ్మకు అతి ఇష్టమైన నువ్వుల లడ్డు,రాగి లడ్డు,పల్లి పట్టీలు,మునగాకు చెక్కలు ,మినుముల,మురుకులు మరియు ఆపిల్ పండును ఇవ్వడం జరిగింది.అనంతరం డాక్టర్ అలోక్ అగర్వాల్ మాట్లాడుతూ.. నా గురువైన సుమన మేడం ఆశయాలను ముందుకు తీసుకెళ్తానని, అభివృద్ధి నా ప్రధాన ధ్యేయమని అందరూ సుఖ సంతోషాలతో జీవించడమే మా లక్ష్యం అని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి మాజి ఎంఈఓ శంకర్ రాథోడ్,విశ్రాంత ఉపాధ్యాయులు సురేష్ కుమార్, బూర్గుల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రీతి బాల, ఉపాధ్యాయులు, బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్వాడి టీచర్లు,సామాజిక కార్యకర్తలు, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# దిశ మరియు ఆదాబ్ హైదరాబాద్ పత్రికల్లో చేరిన పూర్ణచందర్, రమేష్ లకు జర్నలిస్ట్ లకు హార్థిక శుభాకాంక్షలు..




**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** సంచలనాత్మక కథనాలకు పేరొందిన అదాబ్ హైదరాబాద్ తెలుగు దినపత్రిక షాద్ నగర్ నియోజక వర్గ ఇంచార్జిగా షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టు రమేష్ ఆర్కే నియమితులైనందుకు రమేష్ కి మరియు పూర్ణ చందర్ దిశ తెలుగు దినపత్రిక నియోజకవర్గ ఇన్చార్జిగా షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టు పూర్ణచందర్ నియమితులయ్యారు. దిశ దినపత్రికలో అన్ని కోణాల్లో సామాజికంగా చైతన్యం చేస్తూ అక్షరాలకు విలువనిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ముందుకు సాగాలని కోరుతూ.. ఇద్దరికీ శుభాకాంక్షలు..

# ఘనంగా నిక్షిత్ జన్మదిన వేడుకలు..

నిక్షిత్ ను ఆశీర్వదించిన షాద్ నగర్ జర్నలిస్ట్ ల బృందం..




**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** ఫరూఖ్ నగర్ మండలం పరిధిలో బూర్గుల గ్రామనికి చెందిన మాజీ వార్డ్ సభ్యులు కో ఆప్షన్ మెంబర్ చిన్నయ్య గారి ఎల్లయ్య రెండవ కుమారుడు అయిన శ్రీనివాస్ నిఖిత దంపతుల కుమారుడు నిక్షిత్ మొదటి పుట్టిన రోజు వేడుకలో షాద్ నగర్ పట్టణం లోని యస్.యస్. బ్యాంకట్ హాల్లో బర్డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ బర్డే కార్యక్రమనికి షాద్ నగర్ జర్నలిస్ట్ ల బృందం పాల్గొని చిన్నారుడిని ఆశీర్వదించడం జరిగింది..

# రాబోయే రోజుల్లో కాబోయే పాలకుడా జి.వై.గిరి రాసిన పాట యువతకు మేల్కొలుపు

**సామాన్యుడి అస్త్రం జనగామ :** రాబోయే రోజుల్లో కాబోయే పాలకుడా జనగామకు చెందిన అభ్యుదయ కవి దివంగత జి.వై.గిరి రాసిన పాట యువతకు మేల్కొలుపుతుందని కవయిత్రి బుదారపు లావణ్య అన్నారు. జనగామలో ఆమె పాటపై సమీక్ష చేశారు. సమీక్ష వివరాలోకి వెళ్లినట్లతే అభ్యుదయ రచయిత జి. వై. గిరి రాసిన చైతన్య గీతాలు దేనికదే సాటి అని వారి కలం నుండి జాలువారిన ప్రతి పాట ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. దిశా నిర్దేశం లేకుండా నిద్రావస్థలో ఉన్న యువతను మేల్కొలుపుతూ రాసిన రాబోయే రోజుల్లో కాబోయే పాలకుడా అనే పాట యువతను,సామాన్య ప్రజానీకాన్ని జాగృతం చేస్తుంది. భవిష్యత్ భారతంలో పాలకుడిగా ఎదగాల్సిన ఓ యువతా..ఈ సమాజం ఏమైపోతే నాకేంటి అని మౌనంగా ఉండిపోతావా ఇలాగైతే నేడు పందికొక్కుల్లా దోచుకుంటున్న స్వార్థ పాలకులు అదేపనిగా దోచుకుంటారు. సూర్యుడి కిరణాలతో ప్రకృతిలో ఉషోదయం కలిగి జీవరాశి కార్యోన్ముకమౌతుంది.. మరి నువ్వేందుకు ఇంకా మత్తు వదలవూ మేల్కొనవు అని చైతన్యపరుస్తాడు. నిన్నటి వరకు బ్రిటిష్, రజాకార్ల నిరంకుశ పాలనలో బందీలుగా మారి బలైన మనం.. వారి పాలన నేలమట్టమై స్వేచ్ఛ







వాయువులు పీల్చుతున్నాము...అని సంతోషించే తరుణాణ నేడు మనలోనే కొంత మంది స్వార్థపరులు మళ్లీ వారి నీడల్లో అవతరిస్తున్నారు జర జాగ్రత్త వహించు అని పాటలో హెచ్చరిస్తారు. శ్రమజీవులు వారి రక్తాన్ని చెమట చుక్కలుగా మార్చి నిరంతరం శ్రమిస్తుంటే వారి శ్రమను దోచుకునే పందికొక్కులు ఎన్నో, పదవుల వేటలో పార్టీలు మారుతూ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇస్తూ, కులాల పేరుతో మతాల పేరుతో చిచ్చు రగిలిస్తూ రాజ్యమేలుతున్నారు. ఓ యువత మేలుకో.. నీ శక్తిని తెలుసుకో.. తెగువతో మున్ముందుకు సాగిపో సమసమాజ స్థాపనకు నడుము కట్టి నీ జాతిని రక్షించుకో అని రచయిత హితవు పలుకుతాడు. ఈ పాట నాలుగు దశాబ్దాల క్రితం రాసినా కూడా నేటి వ్యవస్థకు అద్దం పడుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. నాటికీ నేటికీ వ్యవస్థ ఏమి మారలేదు, ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉన్నది అని ఈ పాట ద్వారా అవగతమవుతుంది. నేటి యువతకు ఈ పాట మేలుకొలుపు గీతం లాంటిదని కవయిత్రి బుదారపు లావణ్య అభిప్రాయపడ్డారు.

# మణుగూరులో పారిశుద్ధ్యం, దోమల నియంత్రణ, వీధి కుక్కల నివారణ చర్యలు




**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** మణుగూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ లు, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, దోమల నియంత్రణ, వీధి కుక్కల నివారణపై తక్షణ చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి ఎంపీడీవో టి. శ్రీనివాస్ కి కమిషనర్ ప్రసాద్ కి వినతిపత్రం అందజేశారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,**

“మణుగూరు మండలంలోని పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో చెత్తా చెదారం పేరుకుపోయి, డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురుగునీరు నిలబడి దోమల ప్రబలత పెరిగింది. దీనివల్ల ప్రజలు అనారోగ్యానికిగురవుతున్నారు,” అని తెలిపారు.

**అలాగే ఆయన వీధి కుక్కల సమస్యపై కూడా ఆందోళన వ్యక్తం చేస్తూ,**

“వీధి కుక్కలు పిచ్చి వ్యాధితో పిల్లలను కరుస్తున్నాయి. మటన్, చికెన్ మార్కెట్ల వద్ద వ్యర్థాలు బహిర్గతంగా పడేయడంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ సమస్యలపై అధికారులు తక్షణ చర్యలుతీసుకోవాలి,”అని కోరారు. ఈ విజ్ఞప్తిపై కమిషనర్ ప్రసాద్ సానుకూలంగా స్పందించి, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కర్నే రవి విలేకరులకు తెలిపారు.

# దొంత రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా

**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట :** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ కోఆర్డినేటర్ దొంత రమేష్ జన్మదిన వేడుకలు జమ్మికుంటలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమం, కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేశిని కోటి హాజరై మాట్లాడుతూ, దొంత రమేష్ యువ కాంగ్రెస్ నాయకుడిగా పేద ప్రజలకు సహాయం చేస్తూ అందరి మన్ననలు పొందారని, భవిష్యత్తులో ఆయనకు మంచి ఉన్నత స్థానాలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, ఎలగందుల సరూప శ్రీహరి, పిట్టల శ్వేత రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు పంజాల అజయ్, కాంగ్రెస్ నాయకులు పాతకాల అనిల్, రామచంద్రం, మాటే టి రాజు, సందీప్, మహేష్, ప్రణయ్, పాతకాల రమేష్, రాచమల్ల మధుకర్, గురుకుంట్ల శ్రీకాంత్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు



# బాలికల రక్షణకు స్నేహిత కార్యక్రమం

**విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి డాక్టర్ చందు**

**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట :** జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ చందు (డిప్యూటీ డీఎంహెచ్ఓ, హుజురాబాద్) మాట్లాడుతూ ు స్నేహిత కార్యక్రమం విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను శక్తివంతం చేయడం, రక్షించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. "పోస్కో వంటి చట్టాలపై అవగాహన కల్పించి, విద్యార్థుల్లో మంచి స్పర్శ, చెడు స్పర్శ పట్ల జాగృతి తెచ్చి ఆత్మవిశ్వాసం పెంచాలి. ప్రతి పాఠశాలలో స్నేహిత ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేస్తాం. విద్యార్థులు పాఠశాల సిబ్బంది లేదా బయట వ్యక్తుల నుంచి ఇబ్బందులు ఎదురైతే భయపడకుండా ఫిర్యాదు పెట్టెలో రాయాలి," అని చెప్పారు ఆ ఫిర్యాదులను షీటీమ్ బృందాలు పర్యవేక్షిస్తాయని తెలిపారు. బాలికల రక్షణలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకంటే ఎక్కువ బాధ్యత వహించాలని, మానవీయ కోణంలో వ్యవహరించాలని





సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.సురేష్ బాబు, హెల్త్ ఎడ్యుకేటర్లు పంజాల ప్రతాప్ గౌడ్, మోహన్ రెడ్డి, ఐసిడీఎస్ సూపర్వైజర్ సాయి అపూర్వ, డిసిపియు కౌన్సిలర్ తేజస్వి, ఏపీఎం కొమురయ్య, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**బాలికల పాఠశాలలో వైద్య శిబిరం**

**డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో నిర్వహణ**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, దగ్గు, జలుబు వంటి సాధారణ సమస్యలపై మందులు పంపిణీ చేశారు.



**డాక్టర్ వరుణ మాట్లాడుతూ**

"వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులను నివారించవచ్చు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, టైఫాయిడ్, జాండిస్ వంటి వ్యాధుల లక్షణాలు తెలిసి ఉండాలి," అన్నారు. విద్యార్థినులు బయటి ఆహారాన్ని తినకుండా, కాచిన నీటిని చల్లార్చి తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హేమలత, డాక్టర్ మహోన్నత పటేల్, సూపర్వైజర్ అరుణ, ఏఎన్ఎం రజిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## జనగామ అమ్మ ఫౌండేషన్



**సామాన్యుడి అస్త్రం జనగామ:** ఈరోజు జనగామ అమ్మ క్యాంటీన్ ఆధ్వర్యంలో శ్రీనివాస బోర్వెల్స్ ప్రొప్రైటర్ పర్వతం రాజ్ కుమార్ 25 లో బియ్యం అందించి జనగామ జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ నందు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు వారికి అమ్మ ఫౌండేషన్ టీం తరపున ప్రత్యేక ధన్యవాదాలు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో ఈరోజు 25 కిలో బియ్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించిన పర్వతం రాజ్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ప్రతి ఒక్కరు సందర్భం ఏదైనా కానీ పెళ్లిరోజు పుట్టినరోజు సందర్భంగా ఒక పూట ఆకలి తీర్చి నిరాశ్రయులకు అనాథలకు నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని ప్రజలకు యువతకు పిలుపునిచ్చారు ఈ సేవ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి కొయ్యడ రవి, బింగి నరసింహులు, ఎర్రబెల్లి బాబు ,యు టెల్లి, విక్రమ్ కుమార్, ఎండి అఫ్రోజ్ ఉల్లెంగుల మణీ , కొయ్యడ విశ్వ, సిద్ధిరాల చందు, దానమ్మ, తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన జీడీ ప్రీతి





**సామాన్యుడి అస్త్రం జనగామ:** ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ అథ్లెటిక్స్ మీట్ లో నిర్వహించిన 600 మీటర్ల జూనియర్ గర్ల్స్ విభాగంలో పల్లగుట్ట విద్యార్థిని జీడి ప్రీతి ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి ఈనెల 14వ తారీఖున రంగారెడ్డి జిల్లా జింఖానా గ్రౌండ్స్ ( హైదరాబాద్ )లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లంభ ట్ల విజయకుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎన్నికైన జీడీ ప్రీతి ని పాఠశాల వ్యాయామ విద్య దర్శకులు శ్రీ జే. దేవ్ సింగ్ ని పాఠశాల విద్యా కమిటీ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించడం జరిగింది.

## విద్యార్థుల పరిస్థితి తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు



**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట :** హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు జమ్మికుంట ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలను మంగళవారం సందర్శించారు.నిన్న మధ్యాహ్న భోజనం తిన్న అనంతరం విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈరోజు నాయకులు పాఠశాలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఘటనపై ఎంఈఓ, ఫుడ్ ఇన్స్పెక్టర్‌లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వంట సిబ్బందిని కూడా సంప్రదించి, భోజనం తయారీ విధానం గురించి విచారణ జరిపారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆహార నమూనాలను సేకరించి, పరీక్ష కోసం పంపించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వంట సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దేశిని కోటి స్వప్న వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ సత్తి రెడ్డి, బొంగోని వీరన్న, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, పొనగంటి మల్లయ్య, పిట్టల రమేష్, ఎలగందుల శ్రీహరి, పంజాల అజయ్, పుదారి శివ, రేణుక తదితరులు పాల్గొన్నారు

## తండ్రికి గౌరవ డాక్టరేట్.. కుమార్తెకు డాక్టర్ సీటు

**డప్పు కళాకారుల ఘన సన్మానం**



**సామాన్యుడి అస్త్రం, జమ్మికుంట :** తండ్రి సేవకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్.. కుమార్తె ప్రతిభకు డాక్టర్ సీటు. జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ (ప్రభు) కి తమిళనాడు రాష్ట్రంలోని హొసూర్ నగరంలో సామాజిక సేవా రంగంలో విశేష సేవలందించినందుకు గౌరవ డాక్టరేట్ అవార్డు లభించింది.అలాగే ఆయన పెద్ద కుమార్తె అంబాల అక్షిత 202425 విద్యా సంవత్సరానికి గాను నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎం.బి.బి.ఎస్ సీటు పొందింది. ఈ రెండు సంతోషకర సందర్భాలను పురస్కరించుకుని మడిపల్లి నర్తన డప్పు కళా బృందం కళాకారులు మంగళవారం జమ్మికుంట న్యూ జర్నలిస్ట్ కాలనీ లోని ప్రభు నివాసంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ, "ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగి, ఆపదలో ఉన్నవారికి తోచిన సహాయం చేయడం నా కర్తవ్యంగా భావిస్తాను. ఈ గౌరవ డాక్టరేట్ ఆ సేవలకు సమాజం ఇచ్చిన గుర్తింపు" అని అన్నారు. కళాకారులు మాట్లాడుతూ ప్రభు గారు సమాజ సేవకుడిగా, చిత్రకారుడిగా, అంతర్జాతీయ క్రీడాకారుడిగా, డప్పు కళాకారుడిగా అనేక రంగాల్లో రాణించి ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జె. సతీష్, అంబాల శ్రీరామ్, గంగారపు తిరుపతి, అంబాల రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పదవతరగతి విద్యార్థులకు బండి సంజయ్ చేయూత

**12,292 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లింపు**

**బిజెపి సీనియర్ నాయకుడు మట్ట పవన్ రెడ్డి**






**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా నిలిచారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన 12,292 మంది పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులను ఆయన తన జీతం మొత్తాన్ని వినియోగించి, సంబంధిత జిల్లాల కలెక్టర్లకు చెక్కుల రూపంలో అందజేశారని ఇల్లందకుంట మండల బిజెపి సీనియర్ నాయకుడు మట్ట పవన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ "బండి సంజయ్ విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న సేవ అపూర్వం. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నారు" అన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో 'మోడీ కిడ్స్' పేరుతో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, వాటర్ బాటిల్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు గుర్తుచేస్తూ, విద్యార్థుల తరపున బండి సంజయ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ విద్యాదినోత్సవం



**సామాన్యుడి అస్త్రం, శేరిలింగంపల్లి :** జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్ డివిజన్ పరిధిలోగల గచ్చిబౌలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాదు కేంద్రీయ విశ్వ విద్యాలయం ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ డిపార్టుమెంటుకు చెందిన ఆచార్య తాళ్ళ సుమాలిని హాజరై ప్రసంగించారు. " దేశంలో గుణాత్మక విద్యకు మార్గదర్శి మరియు విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబుల్ కలాం ఆజాద్ " అని కొనియాడారు. " ఆజాద్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు. స్వాతంత్రోద్యమంలో పది సంవత్సరముల కారాగార శిక్షను అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడు. ఆజాద్ .పండితుడు, కవి, సంపాదకుడు, గొప్ప రాజనీతిజ్ఞుడు " అని అన్నారు.నేటి విద్యార్థులే నేటి పౌరులు. నేటి విద్యార్థులు అంతర్జాలానికి ఆకర్షితులై వారి విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. అవసరమైనంత వరకే అంతర్జాలాన్ని ఉపయోగించుకోవాలి" అని కోరారు. " చెడు అలవాట్లకు (ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగం) దూరంగా ఉండాలి. పౌష్టికాహారం తీసుకుంటూ నిత్య వ్యాయామం, ధ్యానం ఆచరించి ఆరోగ్యాన్ని కాపాడుకొని అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అంది పుచ్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకొని దేశాభివృద్ధికి పాటు పడటంతో పాటు సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయడమే మనము ఆయనకు అర్పించే నిజమైన నివాళి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి రిటైర్డ్ ఆఫీసరు, అధ్యాపకులు జి. రాములు, జి. హన్మంతు, కె.మోహన్, మహేష్ గౌడ్, జగదీష్, విద్యార్థినీ, విద్యార్థులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కమలాపూర్ లో అంధుడికి ఇందిరమ్మ ఇల్లు ప్రణవ్ బాబు చొరవ



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** కేంద్రానికి చెందిన ఎత్తిపతి బిక్షపతి అనే యువకుడు పదో తరగతి చదువుతున్న సమయంలో రెండు కళ్ల దృష్టి కోల్పోయాడు. ప్రస్తుతం నివాసం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతని పరిస్థితిని గమనించిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు చొరవతో, బిక్షపతికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించబడింది. ఈరోజు కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి చేతుల మీదుగా బిక్షపతికి మంజూరీ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిక్షపతి కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ప్రణవ్ బాబు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డా. మౌటం కుమారస్వామి, కంభంపాటి ప్రసాద్, ఆన్‌కార్ అశోక్, మౌటం రమేష్, మార్కెట్ డైరెక్టర్ సముద్రాల కృష్ణ, జిల్లా కాంగ్రెస్ ఎస్ఎస్ఎల్ ఉపాధ్యక్షులు గూడెపు మొగిలయ్య, పుల్ల శోభన్, వాయినాల సాంబయ్య, మస్నా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన తౌటం ఝాన్సీ రాణి, "ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలని" కోరారు.

## వ్యభిచార గృహంపై దాడులు

**– 5 గురు విదేశీయులను అరెస్టు చేసిన మియాపూర్ పోలీసులు**



**అస్త్రం, మియాపూర్:** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న 5 గురు విదేశీయులను అరెస్ట్ చేసిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరి ధిలోని న్యూ హఫీస్ పెట్ సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో ఓ ఇంట్లో గుర్తు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటి, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్కడ తనిఖీ చేయ గా విదేశీయులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. లైబేరియా దేశం లోని మొన్రోవియా సిటీ కి చెందిన డేరియస్ (28) 2021 సంవత్సరంలో విద్యాభ్యాసం నిమిత్తం భారతదేశానికి వచ్చి సుభాష్ చంద్రబోస్ నగర్ లో ఉంటూ ఓ కళాశాలలో చదువుకుంటున్నాడు. ప్రస్తుతం ఆన్లైన్లో విద్యను అభ్యసిస్తున్నాడు. ఇతనితోపాటు కెన్యా దేశానికి చెందిన 2 మహిళలు ఉగాండా దేశానికి చెందిన 2 మహిళలతో కలిసి వ్యభిచారం చేయిస్తున్నట్లు గుర్తించారు. డేరియస్ తో పాటు నలుగురు విదేశీ మహిళలను అరెస్టు చేసి మియాపూర్ పోలీస్ స్టేషన్కు తరలించారు. వారి వద్ద నుండి 4 వేల రూపాయల నగదు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు మహిళలను రెస్క్యూ హోం కు తరలించగా డేరియస్ ను రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వీరి వెంట ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# అసమాన ప్రతిభాశాలి వెంకట సుబ్బన్న


కడప వెంకటసుబ్బన్న తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభా శాలి. అవధాన ప్రక్రియలో అందెవేసిన చేయి. సహస్రాధిక అవధాన కార్యక్రమ నిర్వహణా దురందరులు. అవధానాలు మాత్రమే కాక, పురాణ ప్రబందా లను అలవోకగా రచించిన సవ్యసాచి. సి.వి. సుబ్బన్న.(కడప వెంకట సుబ్బన్న) అద్భుతమైన ప్రతిభ, అనన్య సామాన్యమైన వ్యుత్పత్తి, అసాధారణమైన అభ్యాసం కలిగిన శతావధాని. వర్ణన, సమస్యా పూరణం, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, నిషేధాక్షరి మొదలైనా ఏ అంశాన్నయినా అలవోకగా నిర్వహించగలిగిన సరస్వతీ పుత్రుడు. వెయ్యికి పైగా అవధానాలు నిర్వహించిన ఘనత ఆయనదే. సుబ్బన్న కడప జిల్లా ప్రొద్దుటూరు లో నవంబరు 12 , 1929 న కడప రంగమ్మ చెన్నప్ప దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య ప్రొద్దుటూరులో, సెకండరీ విద్య అనీబిసెంట్ మునిసిపల్ హైస్కూలులో, ఇంటర్మీడియట్ మదనపల్లి అనీబిసెంట్ కళాశాలలో జరిగింది. తరువాత డిగ్రీ, ఎం.ఎ. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి పూర్తి చేశారు. కె.సుబ్బ రామప్ప పర్యవేక్షణలో "అవధాన విద్య" అనే విషయంపై పరిశోధనచేసి మైసూరు విశ్వ విద్యాలయం నుండి 1981లో పి.హెచ్.డి పట్టాను పొందారు. అదే సంవత్సరం అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేటుతో ఆయనను సత్కరించారు. ఆంధ్ర దేశాన్ని అవధానాలతో ఉర్రూతలూపి, పద్యాన్ని పశువుల కాపరి దాకా తీసుకుపోయిన తిరుపతి వేంకట కవులు గ్రంథాలు రచించి తమ పద్యా విద్యా ప్రతిభను ప్రదర్శించినట్లే, సి.వి. సుబ్బన్న శతావధాని కూడా శతానేక అవధానాలు చేసి పదికి పైగా పద్య గ్రంథాలు రచించారు. సుబ్బన్న అనేక ప్రాంతాల్లో చేసిన అవధానాల్ని క్రోడీకరించి మూడు సంపుటాలుగా ముద్రించారు. ఆమూడింటిని కలిపి శతావధాన ప్రబంధం త్రిపుటిః పేరుతో బృహద్గ్రంధాన్ని ప్రచురించారు. శ్రీ భద్రాచల రామదాస ప్రబంధం, దివ్య లోచన ప్రబంధం (ధనుర్దాసు) భోజ కువింద చరిత్రము, గోపవధూ కైవల్యము, త్రివేణి, దుర్భిక్షము, పల్లె పదాలు, కళావాహిని, తీయని త్రోవ, నైవేద్యము, అష్టావక్రుడు, పురందర దాసు, కుంతి, చెంచులక్ష్మి (నాటకం), శ్రీ వీరాంజనేయ శతకం, శ్రీకృష్ణ శతకం, శ్రీ రామలింగేశ్వర శతకం, శ్రీ వేంకటేశ్వర శతకం అనే గ్రంథాల్ని రచించి ప్రచురించారు. అవధాన విద్యను గూర్చి ఆయన రచించిన సిద్ధాంత గ్రంథాన్ని శ్రీ పొట్టి శ్రీరాములు




తెలుగు విశ్వ విద్యాలయం వారు ముద్రించారు. 'శ్రీ వ్యాసవిలాస ప్రబంధము'ను సి.వి.సుబ్బన్న 2004లో మొదటి ముద్రణగా వెలువరించారు. తర్వాతి సంవత్సరమే ఇది రెండవ ముద్రణకు నోచుకొని, అశేష ప్రజాదరణ పొందింది. అష్టాదశ పురాణాల రచనయే గాకుండా పంచమ వేదమైన భారత రచనకు నడుం బిగించి, మహావిష్ణువు అవతారమైన వ్యాసుని జీవిత పూర్వాపరాలను ప్రబంధంగా రచించడం ద్వారా ప్రతిభ తేట తెల్ల మయింది. శ్రీ వ్యాస విలాస ప్రబంధము'లో ఏడు ఆశ్వాసాలలో... ప్రతి ఆశ్వాసం లోనూ కథను సక్రమంగా నడిపించటానికి, ఆయా సన్ని వేశాలకు ప్రత్యేక శీర్షికలుంచటం, అరుంధతీ పాణి గ్రహణంతో ప్రథమాశ్వాసం ప్రారంభమై, తర్వాత పరాశర జననం, వసురాజు, శుక్తిమతి మత్స్యగంధి వృత్తాంతాలు, సద్యోగర్భం లో వ్యాసుడు మత్స్యగంధికి పరాశరునికి జన్మించటం, శంతనుడు గాంగేయుని భీష్మ ప్రతిజ్ఞ తదితర అంశాలను మూలాన్ని విభేదించకుండా రాయడం అద్భుత రచనా సృష్టికి, సామర్థ్యానికి తార్కాణం. 2007లో ప్రథమ ముద్రణగా వెలువరించిన ప్రబంధం 'భద్రాచల శ్రీరామదాస ప్రబంధము', భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి పొందిన కంచెర్ల గోపన్న జీవిత చరిత్రను, ఆనాటి చారిత్రక విశేషాలను పద్య ప్రబంధంగా సుబ్బన్న రచించారు. సంస్కృత సమాస భూయిష్టంగా పద్యాన్ని ఎలా కూర్చారో, తేట తెలుగు పదాలతో పద్యాన్ని అలాగే భావం, విషయం, పటుత్వం తగ్గకుండా జేయగలిగిన గొప్ప ప్రతిభాశాలి సుబ్బన్న. మొదటి అవధానం ప్రొద్దుటూరులో 1950వ సంవత్సరంలో శివరాత్రి పర్వదినం నాడు చేశారు. చివరి అవధానం 1997లో ఫిబ్రవరి 25వ తేదీన పేరాలలో చేశారు. ఈ మధ్య కాలంలో అంటే 47 సంవత్సరాల పాటు వెయ్యికి పైగా అష్ట, శతావ ధానాలు చేశారు. భారత దేశ మంతా తిరిగి అవధాన ప్రతిభా సామర్థ్యాన్ని నిరూపించు కొన్నారు. షష్టిపూర్తి తర్వాత కూడా ధారణ తగ్గకుండా అవధానాలు చేసి అందరి మెప్పులు పొందిన సరస్వతీ పుత్రులు సుబ్బన్న శతావధాని. సాహిత్య రంగంలో లబ్ధప్రతిష్ఠులైన దేవులపల్లి కృష్ణ శాస్త్రి, చెలమచెర్ల రంగాచార్యులు, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, డా.దివాకర్ల వేంకటా వధాని, వెంపరాల సూర్య నారాయణ శాస్త్రి , గంటిజోగి సోమయాజి, దీపాల పిచ్చయ్య శాస్త్రి, మధునా పంతుల సత్య నారాయణ శాస్త్రి , డా.పుట్టపర్తి నారాయణాచార్యులు, దాశరథి, డా.సి.నారాయణరెడ్డి, ఆరుద్ర వంటి వారెందరో సుబ్బయ్య అవధానాలలో పృచ్ఛకులుగా వ్యవహరించిన గొప్పతనాన్ని మూట కట్టుకున్నారు. ప్రబంధ రచనలో, కవిత్వ పటుత్వ సంపదలో సాటిలేని మేటిగా పేరెన్నిక గన్నారు. పద్యానికి కాలం చెల్లిందను కొంటున్న కాలంలో, పెద్ద కావ్యాలకు ఆదరణ కరువు అవుతున్నది అనుకునే సమయంలో ఛందోబద్ధంగా అద్భుత ప్రబంధాల్ని రచించి సహృదయ పాఠకుల, శ్రోతల మన్ననలను పొందిన సి.వి.సుబ్బన్న శతావధాని ప్రజ్ఞ అనన్య సామాన్యం. అవధాన ప్రక్రియను తిరుపతి వేంకట కవులు కొప్పరపు సోదరుల తర్వాత విశేషంగా వ్యాప్తి చేసిన సాహితీవేత్తగా సుబ్బన్నకు పేరుంది. 1964లో గుర్రం జాషువా అధ్యక్షతన ఆయనకు భట్టిప్రోలులో కనకాభిషేకము, గజారోహణ మహోత్సవం జరిగింది. ఆయనకు పది పర్యాయాలు కనకాభిషేకం జరిగింది. 1965లో దీపాల పిచ్చయ్య శాస్త్రి అధ్యక్షతన బెజవాడ గోపాల రెడ్డిచే అవధాని ఎడమ కాలికి గండ పెండేరము తొడగ బడింది. 1981లో శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం వారిచే గౌరవ డాక్టరేటు పొందారు. అనేక సన్మానాలు, సత్కారాలు పొందారు. విశాఖలోని లోక్ నాయక్ ఫౌండేషన్ అందించే విశిష్ట పురస్కారం, మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా పురస్కార గ్రహీతగా నిలిచారు. సరస్వతీ పుత్ర, అవధాని పితామహ బిరుదులు పొందారు. సుబ్బయ్య మార్చి 5, 2017న హైదరాబాదులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాసను విడిచారు.

# కర్మయోగి మదన్‌మోహన్ మాలవ్య

భారత దేశ వాసులచే –మహాత్ముని'గా గౌరవించ బడిన మహా మనీషి జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. అలాంటి గాంధీ చేతే –మహామాన–బిరుదు పొందిన నేత పండిట్ మదన్ మోహన్ మాలవ్య. మదన్ మోహన్ మాలవ్య (1861–1946) భారతీయ విద్యావేత్త, రాజకీయ వేత్త. భారతీయ స్వాతంత్ర్యో ద్యమంలో పాల్గొన్న సమర యోధుడు. ఆయన "పండిట్ మదన్ మోహన్ మాలవీయ" గా కూడా సుపరిచితుడు. ఆయన "మహాత్మా" గా కూడా గౌవరింప బడ్డాడు. మాలవ్య1915 లో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా నాలుగు సార్లు పనిచేశాడు. 1861, డిసెంబర్ 25 తేదిన అలహాబాదులో మూనాదేవి, బ్రిజ్‌నాథ్ దంపతులకు జన్మించిన మదన్ మోహన్ మాలవ్య పూర్వీకులు మధ్యప్రదేశ్ లోని మాల్వా ప్రాంతం నుండి వలస వచ్చారట. అందుకే ఆయన ఇంటి పేరు కూడా మాలవ్యగా సార్థక మైంది. ఆయన అసలు ఇంటి పేరు చతుర్వేది. మాలవ్యాలు బెనార్స్ లోని అగర్వాల్ వర్తకులకు ఇంటి పురోహితులుగా ఉన్నారు. ఆయన తండ్రి సంస్కృత గ్రంథములను అభ్యసించేవాడు. ఆయన శ్రీమద్భాగవతమును చెప్పి ధనం సంపాదించే వాడు. మాలవ్య సంప్రదాయకంగా రెండు సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఆయన ఆంగ్ల పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. పాఠశాల రోజుల నుండే మకరంద్ అనే కలం పేరుతో కవిత్వం రాయడం ప్రారంభించాడు మాలవ్య. 1879 లో ముయిర్ సెంట్రల్ కాలేజీ నుండి మెట్రి క్యులేషన్ పూర్తి చేశాడు. ఆ కళాశాల ప్రస్తుతం అలహాబాదు విశ్వ విద్యాలయంగా ప్రసిద్ధి చెందినది. మాలవ్యా కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. లో పట్టభద్రులైనాడు. సంస్కృతం లో ఎం.ఎ చేయాలనుకున్న ప్పటికీ ఆయన కుటుంబ పరిస్థితులు సహకరించలేదు. తర్వాత ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని మొదలు పెట్టాడు. అంతకు ముందే ఆయన 'ది ఇండియన్ ఒపీనియన్' అనే పత్రికకు సబ్ ఎడిటర్‌గా పని చేశాడు. అలాగే న్యాయ శాస్త్రంలో కూడా పట్టా పొందాడు. 1907లో మాలవ్య స్వయంగా 'అభ్యుదయ' అనే వార్తాపత్రిక ప్రారంభించాడు. 1909 లో అలహాబాదు నుండి వెలువడు తున్న ఆంగ్ల పత్రిక లీడర్ పత్రికను స్థాపించాడు. ఆయన 1924 నుండి 1946 వరకు హిందూస్థాన్ టైమ్స్‌కు చైర్మన్ గా ఉన్నాడు. ఆయన



సేవలు 1936 లో హిందీ ఎడిషన్ ప్రారంభానికి ఉపయోగపడ్డాయి. 1908లో బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలపై ఆంక్షలు విధించి నప్పుడు.. వాటికి వ్యతిరేకంగా అలహాబాద్‌లో అఖిల భారత కాన్ఫరెన్సును నిర్వహించాడు. 1922లో హిందు మహాసభ అధ్యక్షుడుగా పనిచేశాడు. "సత్యమేవ జయతే" అనే నినాదాన్ని తొలినాళ్లలో ప్రాచుర్యం లోకి తీసుకొచ్చింది మాలవ్యనే. మాలవ్య భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా నాలుగు సార్లు (1909, 1913,19 19,1932) పని చేశాడు. ఆయన 1934లో కాంగ్రెస్ ను విడిచి పెట్టాడు. హిందూ మహాసభలో ముఖ్యమైన నాయకునిగా కూడా ఉన్నాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రేసు పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. 1922 లో చౌరీ చౌరా దాడుల ఘటనలో మరణశిక్ష పడిన 225 మంది స్వాతంత్ర్య సమర యోధులు, సాధారణ ప్రజానీకం తరపున వాదించి వారిలో 153 మందికి ఆ శిక్ష పడకుండా కాపాడగలిగాడు. గంగా నది పరిరక్షణ కోసం 'గంగా మహాసభ' పేరుతో ఉద్యమాన్ని కూడా లేవదీశాడు మాలవ్య. భారతీయ స్కౌట్స్ మరియు గైడ్సు వ్యవస్థాపకులలో మాలవ్య ఒకడు. బ్రిటీష్ నియంతల రాజ్యానికి ఊతమిచ్చేందుకు ప్రారంభించిన సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా గళం విప్పాడు. బ్రిటిష్ రాజ్యంలో భారత భవిష్యత్తును నిర్ధారించ డానికి ఏర్పాటైన సైమన్ కమీషన్ ను వ్యతిరేకించడానికి లాలా లజపతి రాయ్, జవహర్ లాల్ నెహ్రూ ఇంకా ఇతర స్వాతంత్ర సమర యోధులతో కలిశాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. "సత్యమేవ జయతే" అనే నినాదాన్ని వ్యాపింప చేసాడు. ఆయన గొప్ప విద్యావేత్త, కర్మయోగి, భగవద్గీతను అనుక్షణం అనుసరించడానికి ఇష్టపడే వాడు. సమకాలిక నాయకుల వలే కులమత భేదములను పోగొట్టడానికి ప్రయత్నించాడు. 1932 ఆగష్టులో జరిగిన రెండవ రౌండు టేబులు సమావేశం తరువాత రామ్సే మెక్డొనాల్డ్ ప్రధాన మంత్రిగా ఉన్న బ్రిటిషు ప్రభుత్వం, బి.ఆర్.అంబేద్కర్ ప్రతిపాదన మేరకు బ్రిటిషు ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును తీసు కొచ్చింది. ప్రభుత్వం అల్ప సంఖ్యాక మతస్తులకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయడం ఈ అవార్డు లక్ష్యం. అయితే ముస్లిములు, సిక్కులతో పాటు, దళితులను కూడా అల్ప సంఖ్యాక మతస్తులుగా ఈ అవార్డు ప్రకటించింది. అయితే మహాత్మా గాంధీ దీన్ని వ్యతిరేకించాడు. దళితులను విడదీస్తే హిందూ మతం విచ్ఛిన్నం అవుతుందని భావించి, అందుకు నిరసనగా గాంధీ పూనాలోని ఎరవాడ జైల్లో నిరాహార దీక్ష చేపట్టాడు. కాంగ్రెసు నాయకులు గాంధీ వాదనకు మద్దతు తెలిపారు. ఆ సమయంలో అంబేద్కరు ఎరవాడ జైల్లో గాంధీతో చర్చలు జరిపాడు. వారి చర్చల ఫలితంగా వెలువడిందే పూనా ఒప్పందం. 1932లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతిపాదించిన పూనా పాక్ట్ అగ్రిమెంట్ పై ఆయనతో కలిసి మాలవ్య సంతకం చేశాడు. మాలవ్య బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ఇది ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వ విద్యాలయం, ప్రపంచం లోనే పెద్ద విశ్వ విద్యాలయం. ఇందులో 12,000 లకు పైగా విద్యార్థులు కళలు, విజ్ఞాన శాస్త్రము, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీలలో విద్యనభ్య సిస్తున్నారు. మాలవ్య ఆ విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా 1919 నుండి 1938 వరకు పనిచేశాడు. జీవితకాలం మొత్తం బ్రహ్మచారిగానే గడిపిన మాలవ్య 1946 నవంబరు 12 (వయసు 84)న బనారస్ లో మరణించాడు. డిసెంబర్ 24,2014 న మదన్ మోహన్ మాలవ్యను ఆయన మరణాంతరం భారతదేశం లోని ప్రతిష్ఠాత్మక అవార్డు భారతరత్నకు వరించింది.

# ప్రజల గుండె చప్పుడైన కవి

బడికి వెళ్లి ఆయన అక్షరాలు చదవలేదు.. కానీ సమాజాన్ని ఆయన తన అంతర్ హృదయంతో చూశారు. సమాజంలో జరుగుతున్న ప్రజల వ్యథలు, పోరాటాలను కళ్లతో చూసి.. ఆ బాధలే ఆయనను ప్రజల పక్షాన ప్రజా గొంతుకగా నిలబడేలా చేసింది. చిన్నతనం నుంచే అనాథగా బతికిన ఆయన గుండెకు తాకిన గాయాలు ఎన్ని ఉంటాయో.. గొడ్ల కాపరిగా పనిచేస్తూ ప్రకృతి.. మూగజీవాలతోనూ మమేకం అయ్యారు. ప్రకృతి ఎదుర్కొనే ముప్పును సైతం పదాల అల్లికతో జత కట్టి పాటలు, పద్యాలు పాడుకున్నాడు. సమాజంలో భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న ప్రజల బతుకులను చూశాడు. కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా.. మానవ సంబంధాలకు కనీస విలువనివ్వని సమాజాన్ని కళ్లారా చూశారు. ఆయన కళ్లతో చూసిందే.. పదాల అల్లికతో గేయంగా మారి ఆ గాయాన్ని మాన్పింది. అణచివేతల మీద ఆయన పాట ఉక్కు పిడి కిళ్లుగా మారాయి. అన్యాయంపై గళమెత్తే జన గర్జన అయింది. అందుకే అందెశ్రీ ఉద్యమ జన జాతర. తెలంగాణ మలి విడత ఉద్యమం ఉధృతంగా మారిన సమయంలో అందెశ్రీ పాటలు ప్రజల్లో గొప్ప పోరాట పటిమను చూపాయి. జన జాతరలో మన గీతం జయకే తనమై ఎగరాలి.. జంజవారుతా జన నినాదమై సాగాలి.. అంటూ మలి విడత ఉద్యమంలో ఆయన కవిత్వాలు లక్షలాది మందిని కదిలించాయి. చిన్న తనంలోనే కష్టాలు చూసిన అందెశ్రీ ప్రజల బతుకుల్లో గుణాత్మక మార్పు, సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో రచనలు చేశారు. రవి చేరని చోటు ఉంటుంది.. కానీ కవి చేరని చోటు ఉండదు అన్నట్లుగా ఆయన కవిత్వం, పాటల రూపంలో ప్రతీ గుండెను తాకారు. ఆవేదనల గుండెలకు బలయ్యారు. అణచివేతపై తిరుగుబాటు గళం అయ్యారు. పోరాట పిడికిళ్లకు పదునైన గీతంగా మారాడు అందెశ్రీ. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. అనాథగా పెరిగిన అందెశ్రీ చిన్నతనంలోనే కష్టాలు వెంటాడాయి. తన కష్టాలను ప్రజల్లో, సమాజంలో చూసిన ఆయన తన పల్లెతో, ప్రకృతితో, మనుషుల హృదయాలతో మమేకం అయ్యారు. పల్లె జీవన బతుకులు తెలిసిన వ్యక్తిగా పల్లె నీకు వందనాలమ్మో.. తల్లీ నీకు వందనాలమ్మో.. అంటూ పల్లెను తల్లితో పోల్చి బతుకు విలువను నేర్పిన పల్లెలపై మమకారాన్ని చాటారు. కొమ్మ చెక్కితే బొమ్మరా.. కొలిసి మొక్కితే అమ్మరా మాయమైపోతున్నాడమ్మా మని షన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు అంటూ సమాజంలో మంట కలుస్తున్న మానవ సంబంధాలపై రాసిన పాటలన్నీ ఆయన గుండెల నుంచి సమాజం కోసం ఉప్పొంగిన గొప్ప అక్షరాలు.. తెలంగాణ మలి విడత ఉద్యమం ఉధృతంగా మారిన తరుణంలో ఆ గేయం ఓ పోరాట తిలకంగా నిలిచింది. జనజాతరలో మనగీతం జయకేతనమై ఎగరాలి.. ఒకటే జననం.. ఓహో ఒకటే జననం.. జీవితమంతా జనమే మననం.. కష్టనష్టాలు ఎన్ని ఎదురైనా కార్యదీక్షలో తెలంగాణ అంటూ ఉప్పొంగిన గేయం తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష సాకారానికి ఎంతో భూమిక పోషించింది. అనేక రచనలు, కవిత్వాలతో ఆయన ఎంతోమంది సాహిత్య కారులకు, ప్రజా పోరాటాలకు ఓ చైతన్య

## అందెశ్రీ కి హెచ్ సియు తెలుగుశాఖ నివాళి



**సామాన్యుడి అస్త్రం, శేరిలింగంపల్లి:** తెలంగాణ జాతీయగీతం రచించిన అందెశ్రీ మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని, నిరుపేద కుటుంబంలో పుట్టి, తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగలగడం సామాన్యమైన విషయం కాదనీ హెచ్ సియు తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు వ్యాఖ్యానించారు. అందెశ్రీ మరణానికిసంతాపాన్నితెలుపుతూ అధ్యాపకులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు అనే గేయ రచన ద్వారా మనుషుల్లోని మానవత్వాన్ని తట్టి లేపిన ఒక ఉత్తమ గేయరచయిత అని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంతో ప్రతిభావంతుడైన అందెశ్రీకి ఆరోగ్యం సహకరించి ఉంటే ఎన్నో ఉత్తమ గేయాలు రచించి ఉండేవాడని ఆచార్య గోనా నాయక్ అభిప్రాయపడ్డారు.అందెశ్రీ మరణించిన సందర్భంగా హెచ్ సియు తెలుగు శాఖలో ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగు శాఖకు చెందిన అధ్యాపకులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య ఎం.గోనానాయక్, ఆచార్య పమ్మి పవన్ కుమార్, ఆచార్య డి.విజయలక్ష్మి, ఆచార్య పి.వారిజారాణి, ఆచార్య త్రివేణి వంగరి, ఆచార్య భూక్య తిరుపతి, డా.బి.భుజంగరెడ్డి, డా.పి.విజయ్ కుమార్, డా.బాశెట్టి లత, డా.డి.విజయకుమారి తదితరులు పాల్గొని వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఘనంగా నివాళులు అర్పించారు.

## జమ్మికుంటలో మైనారిటీస్ వెల్ఫేర్ డే వేడుకలు





**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట :** ఇంద్రనగర్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ (జీ–1) లో సోమవారం మైనారిటీస్ వెల్ఫేర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. తల్లిదండ్రులు స్కూల్‌కు హాజరై తమ పిల్లల ఉత్సాహాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యం తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్ని విధాలుగా కృషి చేస్తామని పేర్కొంది.

## ఎన్నికలలో పట్టుబడ్డ అక్రమ మద్యం పారబోసిన అధికారులు



**సామాన్యుడి అస్త్రం, బొల్లారం :**గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ తనిఖీల్లో పట్టుబడిన అక్రమ మద్యం బాటిళ్లను అధికారులు నేడు పారబోసారు. కోర్టు క్లియరెన్స్ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారుల సమక్షంలో ఈ చర్య చేపట్టారు.పోలీసులు సేకరించిన సమాచారం ప్రకారం, మొత్తం 25 కేసులకు సంబంధించి సుమారు 365 లీటర్ల మద్యంని ఓ నిర్మానుష్య ప్రదేశంలో పారబోసినట్లు తెలిపారు. ఈ మద్యం విలువ సుమారు రూ. 2 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఏఈఎస్ మణెమ్మ, సీఐ పరమేష్ గౌడ్, ఎస్సై రాములు, హెడ్ కానిస్టేబుల్ నందు సింగ్‌తో పాటు బొల్లారం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, "అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని, ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యం కేసులను చట్ట ప్రకారం విచారించి తగిన చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు.

## ఘనంగా యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం

**సామాన్యుడి అస్త్రం, శేరిలింగంపల్లి :**



ప్రజలకు ఆర్థిక సేవలు, వ్యాపారాలను ప్రోత్సాహించి సమాజ అభివృద్ధి కొరకు తోడ్పడాలని ఉద్దేశంతో యూనియన్ బ్యాంక్ ప్రయాణం మొదలైందని హైదర్ నగర్ బ్రాంచ్ మేనేజర్ శ్రవణ్ కుమార్ అన్నారు. మంగళవారం బ్యాంకు ఫౌండేషన్ డే ని ట్యాంక్ సిబ్బందితోపాటు ఖాతాదారులతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం ఒక సంస్థ ప్రారంభమైన రోజు మాత్రమే కాదని మన లక్ష్యాలు విలువలు ప్రజలకు సేవచేసిన సంకల్పాన్ని గుర్తుచేసే ప్రత్యేకమైన రోజు అ ఇది కేవలం ఒక సంస్థ ప్రారంభమైన రోజు మాత్రమే కాదని మన లక్ష్యాలు విలువలు ప్రజలకు సేవచేసిన సంకల్పాన్ని గుర్తుచేసే ప్రత్యేకమైన రోజని పేర్కొన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా వినియోగ దారులకు సులభతరంగా సేవలను అందిస్తున్నామని ఆర్థిక సాక్షారతను ప్రోత్సహించి, నైతికత, పారదర్శకత,సేవా భావం వంటి విలువలను పాటించామన్నారు.నేడు యూనియన్ బ్యాంకు విజయానికి వినియోగదారుల విశ్వాసం, ఉద్యోగుల సమిష్టి కృషి ఎంతో నమ్మకం సురగొని ఫలితాలు పొందుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ అమూల్య అసిస్టెంట్ మేనేజర్ జయప్రకాష్ రిటైర్డ్ డిజిఎం కోటేశ్వరరావు అడపాల రిటైర్డ్ ఏజీఎం గౌస్ బాబు బ్యాంకు సిబ్బంది ఈ కార్యక్రమం లో బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ అమూల్య, అసిస్టెంట్, మేనేజర్ జయప్రకాష్,రిటైర్డ్ డిజిఎం కోటేశ్వరరావు అడపాల,రిటైర్డ్ ఏజీఎం బోస్ బాబు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు,తదితరులు పాల్గొన్నారు.

# ముల్లంగి తింటే రోగాలు మాయం



శీతాకాలం వచ్చేసింది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మన చుట్టూ ఉన్న అనేక విషయాలు మారుతాయి. ముఖ్యంగా శీతాకాలంలో మార్కెట్‌లో కొన్ని కూరగాయలు అందుబాటులోకి వస్తాయి. వాటిల్లో ముల్లంగి ఒకటి. చాలా మంది ముల్లంగిని సలాడ్‌లుగా తినడానికి ఇష్టపడతారు. దీని ఆకులను కూరల తయారీకి ఉపయోగిస్తారు. ఇది రుచికరంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. శీతాకాలం వచ్చేసింది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మన చుట్టూ ఉన్న అనేక విషయాలు మారుతాయి. ముఖ్యంగా శీతాకాలంలో మార్కెట్‌లో కొన్ని కూరగాయలు అందుబాటులోకి వస్తాయి. వాటిల్లో ముల్లంగి ఒకటి. చాలా మంది ముల్లంగిని సలాడ్‌లుగా తినడానికి ఇష్టపడతారు. దీని ఆకులను కూరల తయారీకి ఉపయోగిస్తారు. ఇది రుచికరంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ముల్లంగిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముల్లంగిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ సి, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ బి6 వంటి పోషకాలు ఉంటాయి. వీటిల్లో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, గ్లూకోసినోలేట్‌లు కూడా ఉంటాయి. అయితే రాత్రిపూట ముల్లంగిని తినకూడదు. ఎందుకంటే ముల్లంగి వెచ్చదనం, చల్లదనం రెండింటినీ కలిగి ఉంటుంది. అందుకే జలుబు ఉన్నవారు రాత్రిపూట ముల్లంగిని తినకూడదు. ఒక వ్యక్తి 2-3 నెలలు క్రమం తప్పకుండా ముల్లంగి తింటే వారు ఎప్పటికీ అనారోగ్యానికి గురికారు. ముల్లంగి తినడం వల్ల కాలేయం, మూత్రపిండాలు, పేగులు, ఊపిరితిత్తులు, గుండె, మొత్తం జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ముల్లంగి తినడం వల్ల బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. ఇది వాత, పిత్త రుగ్మతలను సైతం నివారించడంలో సహాయపడుతుంది. ఇది అధిక రక్తపోటు, మధుమేహంతో సహా వివిధ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ముల్లంగి ఒంట్లో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో భలేగా పనిచేస్తుంది. ముల్లంగి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల ఉదయం ఖాళీ కడుపుతో ముల్లంగి తినడం వల్ల జీర్ణవ్యవస్థ పరిపూర్ణ స్థితికి చేరుకుంటుంది. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో ముల్లంగి తినలేకపోతే దానిని రోజులో ఎప్పుడైనా ఉప్పుతో కలిపి మిల్లెట్ బ్రెడ్‌తో తినవచ్చు.

## ఉదయం చల్లని నీటితో ముఖం కడిగితే ఏమవుతుంది?



మనందరికీ ఉదయం నిద్ర లేవగానే చల్లటి నీటితో ముఖం కడుక్కోవడం అలవాటు. ఇది కేవలం అలవాటు మాత్రమే కాదు, దీని వెనుక మన చర్మానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే అద్భుతమైన ప్రయోజనాలు దాగి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. చర్మం బిగుతుగా: చల్లటి నీరు చర్మ రంధ్రాలను తాత్కాలికంగా బిగుతుగా చేస్తుంది. దీనివల్ల మురికి, నూనె రంధ్రాలలో పేరుకుపోకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. ఫలితంగా చర్మం మరింత మృదువుగా కనిపిస్తుంది. తక్షణ శక్తి, ఉత్సాహం: ముఖంపై చల్లటి నీటి షాక్ తగలగానే, శరీరంలో రక్త ప్రసరణ పెరుగుతుంది.నరాలు ఉత్తేజితమవుతాయి. ఇది నిద్ర మత్తును త్వరగా తొలగించి.. తక్షణమే మేల్కొలపడానికి, రోజంతా ఉల్లాసంగా ఉండటానికి సహాయపడుతుంది. వాపును తగ్గిస్తుంది: చల్లని నీరు కళ్ల కింద వాపు, తేలికపాటి ఎరుపుదనాన్ని తగ్గించడానికి చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది చర్మంలోని రక్త నాళాలను తాత్కాలికంగా సంకోచింపజేసి వాపును తక్షణమే తగ్గిస్తుంది. చర్మపు సహజ నూనెలు: వేడి నీరు చర్మం సహజ నూనెలను తొలగించి పొడిబారేలా చేస్తుంది. అయితే, చల్లటి నీరు ఆ నూనెలను సంరక్షిస్తుంది. ఇది చర్మం పొడిబారకుండా నిరోధించడానికి మరియు ఆరోగ్యంగా తేమగా ఉంచడానికి సహాయపడుతుంది. సహజమైన మెరుపు : చల్లటి నీటిని ముఖంపై ఉపయోగించినప్పుడు, రక్త ప్రసరణ తక్షణమే పెరుగుతుంది. ఈ మెరుగైన రక్త ప్రవాహం చర్మానికి సహజమైన గులాబీ మెరుపును ఇస్తుంది. రోజంతా తాజాగా, కాంతివంతంగా కనిపించడంలో సహాయపడుతుంది.

# ఈ ఆకు చేసే అద్భుతాలు



తమలపాకు పూజలకే కాదు, మన ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, నోటి దుర్వాసన తగ్గిస్తుంది. చిగుళ్లను కాపాడుతుంది. ముఖ్యంగా ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి, గుండె, కాలేయాన్ని రక్షించడానికి తోడ్పడుతుంది. తమలపాకు మన సంస్కృతిలో ముఖ్యమైనది. ఇది కేవలం పూజలకు, శుభకార్యాలకు మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. దీనిలో ఉన్న మంచి గుణాల కారణంగా దీనిని ఔషధంగా కూడా వాడుకోవచ్చు. తమలపాకు పాన్ ఆరోగ్యానికి హానికరం అయినప్పటికీ కేవలం తమలపాకు మాత్రమే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. %ూవీజ% జర్నల్‌లో ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం.. తమలపాకుల్లో అనేక రకాల బయోయాక్టివ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉన్నాయని తెలిసింది. పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు, యూజినాల్, చావిబెటాల్, సినోల్ వంటి ముఖ్యమైన నూనెలు తమలపాకులో ఉంటాయి. తక్కువ మొత్తంలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ సి, కెరోటినాయిడ్లు కూడా రోగనిరోధక శక్తికి మద్దతు ఇస్తాయి. తమలపాకులలో ఉండే అధిక స్థాయి యాంటీఆక్సిడెంట్లు, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. వాటి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపు, నొప్పి, కణజాల చికాకును తగ్గించడంలో సహాయపడతాయి. ఆర్థరైటిస్ వంటి పరిస్థితులకు కూడా ఇవి మద్దతునిస్తాయి. సాంప్రదాయకంగా తమలపాకులను నమలడం ద్వారా నోరు తాజాగా ఉండి, పరిశుభ్రత పెరుగుతుంది. ఆకుల్లోని యాంటీ బాక్టీరియల్ సమ్మేళనాలు దుర్వాసన, చిగుళ్ల వాపు మరియు దంత క్షయం కలిగించే హానికరమైన సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధిస్తాయి. భోజనం తర్వాత తమలపాకులను తీసుకోవడం వల్ల లాలాజల స్రావం ప్రేరేపించబడి, ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఇది ఉబ్బరం, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం అందిస్తుంది. తమలపాకులోని సమ్మేళనాలు కడుపు పొరను రక్షించి, అల్సర్లు ఏర్పడకుండా నిరోధించవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. తమలపాకులలోని సమ్మేళనాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయని పరిశోధన సూచిస్తుంది. ఇది మధుమేహం, సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. తమలపాకులు ముఖ్యమైన అవయవాలకు మద్దతు ఇచ్చే సామర్థ్యాన్ని చూపించాయి. తమలపాకు శరీరాన్ని డీటాక్సిఫై చేసి, కాలేయాన్ని ఆక్సీకరణ నష్టం నుండి కాపాడతాయి. గుండె: కొలెస్ట్రాల్, లిపిడ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడటం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. మెదడు: యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు మెదడు కణాలను రక్షించి, అభిజ్ఞా పనితీరుకు మద్దతు ఇస్తాయి. గాయాలు త్వరగా నయంతమలపాకులు బలమైన యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటాయి. సంక్రమణ ప్రమాదాన్ని తగ్గించడానికి , వేగంగా నయం కావడానికి సాంప్రదాయకంగా తమలపాకులను చూర్ణం చేసి గాయాలు, కాలిన గాయాలు, కీటకాల కాటుకు నేరుగా పూస్తారు.

# ఆరోగ్యంగా ఉండాలంటే.. అసలు ఏ టైంలో భోజనం చేయాలి?



రోజువారీ ఉరుకుల పరుగుల జీవనంలో సరైన భోజన సమయాలను పాటించడం చాలా ముఖ్యం. ఉదయం 7-8 గంటల మధ్య అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల మధ్య భోజనం, సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య రాత్రి భోజనం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శక్తిని అందిస్తుంది. అలసట, ఒత్తిడిని తగ్గిస్తుంది. సమయానికి తినడం శారీరక, మానసిక అభివృద్ధిని మెరుగుపరుస్తుంది.. నేటి బిజీ జీవితంలో, భోజన సమయాలను పాటించడం నిజంగా పెద్ద సవాలు. కానీ మనలో చాలా మందికి అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం చేయడానికి సరైన సమయం ఏమిటో తెలియదు. సరైన సమయంలో తినడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. ఇది అలసట, ఒత్తిడి, చిరాకు వంటి సమస్యల నుండి బయటపడటానికి కూడా మీకు సహాయపడుతుంది. సరైన భోజన సమయాలను పాటించడం పాఠశాలకు వెళ్లే పిల్లల నుంచి పెద్దలు నేర్చుకోవాలి. ఎందుకంటే పిల్లలు సమయానికి తింటారు. అందుకే వారి శారీరక, మానసిక అభివృద్ధి బాగుంటుంది. అలాగే వారి శరీరం ఎల్లప్పుడూ శక్తిని నిలుపుకుంటుంది.

అల్పాహారం.. రోజులో అతి ముఖ్యమైన భోజనం. అల్పాహారం ఎల్లప్పుడూ ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య తీసుకోవాలి. ప్రతి ఉదయం నిద్రలేచిన 30 నిమిషాల లోపు తేలికైనది ఏదైనా తినాలి. సమయానికి అల్పాహారం తీసుకోవడం వల్ల మీ జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కానీ ఉదయం 10 గంటల తర్వాత అల్పాహారం తినకుండా ఉండాలి. ఉదయం భోజనం శరీరానికి రోజంతా పనిచేయడానికి శక్తిని ఇస్తుంది. ఇక భోజనం చేయడానికి ఉత్తమ సమయం మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల మధ్య. ఈ సమయంలో మీరు భోజనం చేయాలి. అల్పాహారం, భోజనం మధ్య కనీసం 4 గంటల విరామం ఉండాలి. దీనివల్ల మొదటి భోజనం సరిగ్గా జీర్ణమవుతుంది. సాయంత్రం 4 గంటల తర్వాత ఏమీ తినకూడదు. రాత్రి భోజనం తేలికగా ఉండాలి. దీన్ని నిద్రవేళకు ముందు తీసుకోవాలి. సాధారణంగా సాయంత్రం 6 నుండి 8 గంటల మధ్య తినడం ఉత్తమం. పడుకునే ముందు 3 గంటల ముందు తినడం అవసరం. ఇది ఆహారం సరిగ్గా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. అందుకే రాత్రి 9 గంటల తర్వాత తినడం మానుకోవాలి. మీరు ప్రతిరోజూ సరైన సమయంలో ఆహారం తీసుకుంటే ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండటానికి వీలుంటుంది. శరీరానికి నిర్దిష్ట సమయంలో ఆహారం అందితే, శరీర జీర్ణశక్తి (జీవక్రియ) పెరుగుతుంది. అలాగే అలసట, ఒత్తిడి, చిరాకు వంటి మానసిక సమస్యలు తొలగిపోతాయి.

# నిద్ర లేకుండా మనిషి ఎన్ని రోజులు ఉండగలడు?



నిద్ర అనేది మానవ శరీరానికి, మెదడుకు అత్యంత ప్రాథమిక అవసరం. ఒక రోజు సరిగా నిద్ర లేకపోయినా అనారోగ్యంగా, చిరాకుగా అనిపిస్తుంది. సరైన నిద్ర లేకపోతే మానసిక సమతుల్యత దెబ్బతింటుంది. అందుకే శరీరానికి, మనసుకు విశ్రాంతినిచ్చే నిద్ర చాలా అవసరం. అయితే ఒక వ్యక్తి నిరంతరం నిద్ర లేకుండా ఎంతకాలం మేల్కొని ఉండగలడు అనే ప్రశ్నపై చాలా అధ్యయనాలు జరిగాయి. ఒక వ్యక్తి నిద్ర లేకుండా ఎంతకాలం జీవించగలడో ఏ పరిశోధన కూడా ఖచ్చితంగా నిర్ధారించలేకపోయింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్ ప్రకారం.. నిద్ర లేకుండా అత్యధిక కాలం మేల్కొని ఉన్న రికార్డు రాబర్ట్ మెక్‌డొనాల్డ్ పేరిట ఉండేది. అతడు 18 రోజులు, 21 గంటలు, 40 నిమిషాల పాటు నిద్ర పోలేదు. ఈ సుదీర్ఘ కాలం నిద్ర లేమి కారణంగా రాబర్ట్ మెక్‌డొనాల్డ్ ఆరోగ్యంపై అనేక ప్రతికూల ప్రభావాలు కనిపించాయి. దీని తీవ్రత కారణంగా గిన్నిస్ సంస్థ 1997లోనే ఈ వర్గాన్ని పూర్తిగా నిలిపివేసింది. నిద్ర లేకపోవడం వల్ల ఏ వయస్సు వారికైనా తీవ్రమైన పరిణామాలు ఎదురుకావచ్చని ఆస్ట్రేలియన్ ప్రభుత్వ ఆరోగ్య వెబ్‌సైట్ వెల్లడించింది. నిద్ర లేకపోవడం వల్ల ఆలోచనా సామర్థ్యం తగ్గడం, తీవ్రమైన మానసిక స్థితి మార్పులు, చిరాకు, కోపం వంటివి వస్తాయి.తక్కువ శక్తి, బలహీనమైన రోగనిరోధక శక్తి సమస్యలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదు. అధిక రక్తపోటు, మధుమేహం, బరువు పెరగడం లేదా ఊబకాయం, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. శారీరక సమతుల్యత క్షీణించడం, లైంగిక సామర్థ్యం కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి. సాధారణంగా 24 గంటలు నిద్ర లేకపోతే ఆవలించడం, కొద్దిగా శక్తి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కానీ 24 గంటల కంటే ఎక్కువసేపు మేల్కొని ఉంటే, ఈ లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. మెదడు పనితీరు, ఏకాగ్రత దెబ్బతిని ప్రమాదాలు జరిగే అవకాశం పెరుగుతుంది. నిద్రకు చిట్కాలు: ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, మేల్కోవడం అలవాటు చేసుకోండి. పడుకునే గదిని నిశ్శబ్దంగా, చీకటిగా, సౌకర్యవంతంగా, సరైన ఉష్ణోగ్రతలో ఉంచండి. టీవీ, కంప్యూటర్, ఫోన్‌లను పడుకునే గదికి దూరంగా ఉంచండి. పడుకునే ముందు భారీ భోజనం, కెఫిన్, ఆల్కహాల్ తీసుకోకండి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. పడుకునే ముందు పొగాకు తినడం లేదా సిగరెట్లు కాల్చడం పూర్తిగా మానుకోండి.



# మెగాస్టార్ చిరంజీవి - బాబీ కొల్లి కాంబోలో 'మెగా 158' సెన్సేషన్ ఆయన చేరికతో హైప్ డబుల్!

మెగాస్టార్ చిరంజీవి వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే 'విశ్వంభర' షూటింగ్ దాదాపు పూర్తిచేసిన ఆయన, ప్రస్తుతం 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి ఫైనల్ టచ్ ఇస్తున్నారు. ఈ సినిమా పూర్తైన వెంటనే మరో భారీ ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం దర్శకుడు బాబీ కొల్లి డైరెక్షన్‌లో తెరకెక్కనుంది. ప్రస్తుతం 'మెగా 158' ప్రచారం జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా సినిమాగా రూపొందనుంది. ఈ సినిమా కాస్టింగ్, టెక్నీషియన్ల ఎంపికలపై గత కొద్ది రోజులుగా ఫిలింసర్కిల్స్‌లో జోరుగా చర్చ నడుస్తోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. 'మెగా 158' సినిమాకి మాలీవుడ్ టాప్ డీఓపీ నిమిష్ రవి సినిమాటోగ్రఫీ నిర్వహించనున్నారని సమాచారం. 'లుకా', 'రోర్‌షాక్', 'కురుప్', 'కింగ్ ఆఫ్ కొట్టా' వంటి మలయాళ చిత్రాలతో అద్భుతమైన విజువల్స్ అందించిన నిమిష్, టాలీవుడ్‌లో 'లక్కీ భాస్కర్' ద్వారా ఎంట్రీ ఇచ్చారు. ఇటీవల భారీ విజయం సాధించిన 'లోకా చాప్టర్ 1' చిత్రానికి కూడా ఆయనే సినిమాటోగ్రాఫర్. ఇప్పుడు ఈ ప్రతిభావంతుడైన టెక్నీషియన్ చిరంజీవి - బాబీ ప్రాజెక్ట్‌తో జాయిన్ అవుతుండటంతో సినిమా హైప్ మరింత పెరిగింది. 'మెగా 158'లో ఇద్దరు హీరోలు కనిపించనున్నారని, అందులో ఒకరుగా తమిళ హీరో కార్తీ ఉండబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే బాలీవుడ్ దర్శకుడు-నటుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా నటించే అవకాశం ఉందని టాక్. హీరోయిన్‌గా మాళవిక మోహనన్ పేరు వినిపించినా, ఆమె దీనిని ఖండించింది. సంగీత దర్శకుడిగా మొదట ఎస్. థమన్ పేరు వచ్చినా, తరువాత దేవిశ్రీ ప్రసాద్ కూడా రేసులో ఉన్నారని ప్రచారం. వీరిలో ఎవరు ఫైనల్ అవుతారో త్వరలో తెలుస్తుంది. చిరంజీవి %-% బాబీ కాంబోలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' 2023 సంక్రాంతికి భారీ హిట్‌గా నిలిచింది. రూ.230 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన ఆ సినిమా తర్వాత, వీరిద్దరి కాంబోపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ చిత్రాన్ని ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

# అల్లరి నరేశ్ క్రైమ్ థ్రిల్లర్.. ట్రైలర్ వచ్చేసింది



కామెడీ సినిమాలతో అభిమానులను అలరించిన హీరో అల్లరి నరేశ్. అయితే గత కొంతకాలంగా తన ట్రెండ్‌కు భిన్నంగా మాస్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఉగ్రం, బచ్చలమల్లి చిత్రాలతో తన ట్రాక్ మార్చాడు. అయితే ఈ చిత్రాలేవీ ఆయనకు పెద్దగా కలిసి రాలేదు. అయినా మళ్లీ అదే ట్రాక్‌లో వెళ్తున్నారు. ఈ సారి మాస్‌కు భిన్నంగా క్రైమ్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా అల్లరి నరేశ్ నటించిన క్రైమ్ అండ్ హారర్ థ్రిల్లర 12ఏ రైల్వే కాలనీ ఈ చిత్రాన్ని నాని కాసరగడ్డ దర్శకత్వంలో తెరకెక్కించారు. పొలిమేర చిత్రాల డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ సినిమాకు కథ అందించారు. ఈ చిత్రంలో పొలిమేర ఫేమ్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రం నవంబర్ 21న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా విడుదలైన ట్రైలర్ చూస్తే కథ మొత్తం మర్డర్ కేసు చుట్టే తిరగనున్నట్లు తెలుస్తోంది. ఓ హత్య కేసు ఆధారంగా ఈ సినిమాను రూపొందించినట్లు అర్థమవుతోంది. ఈ మూవీలో సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనీష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషించారు.

# 3,800 హార్ట్ సర్జరీలకు ఆర్థిక సాయం.. గిన్నిస్ బుక్‌లో బాలీవుడ్ సింగర్



బాలీవుడ్ ప్రముఖ గాయని పలక్ ముచ్చల్ తన మంచి మనసుతో గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకుంది. ఆర్థిక సాయం అందక గుండె సమస్యలతో బాధపడుతున్న దాదాపు 3,800 మందికి పైగా పేద పిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు చేయిందేందుకు నిధులు సమకూర్చి గిన్నిస్ బుక్‌లో కెక్కింది సింగర్. పలక్ పలాష్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూర్చి నిరుపేద పిల్లలకు హార్ట్ సర్జరీలు చేయించింది ఈ సింగర్. అయితే ఈ విషయంపై ఇప్పటికే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న సింగర్.. తాజాగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. పలక్ ముచ్చల్ ఇండోర్‌లో జన్మించింది. ఒకసారి రైలు ప్రయాణంలో పేద పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించిపోయిన పలక్.. నిరుపేద చిన్నారుల కోసం ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో ఈ సేవా సంస్థను స్థాపించింది.

# రంజీల్లో జమ్ముకశ్మీర్ సంచలనం.. 65 ఏళ్లలో ఢిల్లీపై తొలి విజయం!

## స్పోర్ట్స్

రంజీ ట్రోఫీలో మరో సంచలనం నమోదైంది. మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ కుమార్ చౌదరి ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీతో రికార్డు నెలకొల్పగా.. దేశవాళీలో పెద్ద జట్టైన ఢిల్లీపై జమ్ము కశ్మీర్ జయభేరి మోగించింది. 65 ఏళ్లలో మాజీ ఛాంపియన్‌పై ఆ జట్టుకు ఇదే తొలి విజయం. కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్), అకీబ్ నబీ(5-35), వన్షాజ్ శర్మ(6-68) బంతితో చెలరేగడంతో దశాబ్దాల కలను సాకారం చేసుకుంది. చిరస్మరణ విజయంతో జమ్ము టీమ్ ఎలైట్ గ్రూప్ డీలో రెండో స్థానానికి ఎగబాకింది. రంజీ ట్రోఫీలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన జమ్ము కశ్మీర్ జట్టు ఢిల్లీకి ఊహించని షాకిచ్చింది. పటిష్టమైన ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌ను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ జమ్ము బౌలర్లు తక్కువకే కట్టడి చేశారు. అకీబ్ నబీ(5-35), వన్షాజ్ శర్మ(6-68)లు విజృంభించి విజయానికి బాటలు వేశారు. అనంతరం 179 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ ఓపెనర్ ఖమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) శతకంతో కదం తొక్కాడు. క్రీజులో పాతుకుపోయిన కమ్రాన్‌ను ఔట్ చేసేందుకు ఢిల్లీ బౌలర్లు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది.



### నబీ దెబ్బకొట్టినా..

తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీని అకీబ్ నబీ కోలుకోలేని దెబ్బ తీశాడు. టాపార్డర్ విఫలమైనా కెప్టెన్ అయుష్ బదొని(64), ఆయుష్ డొసెజా(65), సుమిత్ మథూర్(55) అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. ఆఖర్లో అకీబ్ ముష్తాక్(2-30) తిప్పేయగా ఢిల్లీ 211కే ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన జమ్ము కశ్మీర్ సారథి పరాస్ డోగ్రా(106), అబ్దుల్ సమద్(85)ల మెరుపులతో మూడొందలు కొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లోనైనా పెద్ద స్కోర్ చేయాలనుకున్న ఢిల్లీ బ్యాటర్లను వన్షాజ్ శర్మ(6-68) వికెట్ వేటతో హడలెత్తించాడు. ఆయుశ్ బదొని(72), ఆయుశ్ డొసెజ్(65)లు పోరాడినా.. మిడిలార్డర్, టెయిలెండర్లను వన్షాజ్ పెవిలియన్ పంపగా 277కే ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసింది. ప్రత్యర్థి నిర్దేశించిన ఛేదనలో జమ్ము ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అతడు.. 20 ఫోర్లు, 3 సిక్సర్లతో జట్టుక చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

### రాణించిన బంగ్లా బౌలర్లు




రెండు టెస్టులు, మూడు టీ20ల సిరీస్‌ల కోసం ఐర్లాండ్ క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ (నవంబర్ 11) తొలి టెస్ట్ మొదలైంది. సిల్హెట్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 8 వికెట్ల నష్టానికి 270 పరుగులు చేసింది. వెటరన్ ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ (60), కేడ్ కార్మిచేల్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా.. కర్టిస్ క్యాంఫర్ (44), లోర్కన్ టకర్ (41), జోర్డన్ నీల్ (30) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. బ్యారీ మెక్‌కార్తీ 21 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. తొలి రోజు ఆటలో చివరి బంతికి జోర్డన్ నీల్ ఔటయ్యాడు. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ ఆండ్రూ బల్బిర్నీ డకౌట్ కాగా.. హ్యారీ టెక్టర్ 1, ఆండీ మెక్‌బ్రైన్ 5 పరుగులు చేసి ఔటయ్యారు. బంగ్లా బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ 3 వికెట్లతో సత్తా చాటగా.. హసన్ మురద్ 2, హసన్ మహమూద్, నహిద్ రాణా, తైజుల్ ఇస్లాం తలో వికెట్ తీశారు. కాగా, ఈ పర్యటనలో రెండో టెస్ట్ నవంబర్ 19 నుంచి ఢాకాలో జరుగుతుంది. అనంతరం నవంబర్ 27, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు టీ20లు జరుగుతాయి.

### దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్.. సవాల్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమన్న సిరాజ్..!




ఈ నెల 14న నుంచి స్వదేశంలో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్నది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో తొలి మ్యాచ్ జరుగనున్నది. డిఫెండింగ్ వరల్డ్ టెస్ట్ చాంపియన్ దక్షిణాఫ్రికాపై మెరుగైన ప్రదర్శన చేయాలని టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ భావిస్తున్నాడు. సిరాజ్ భారత బౌలింగ్ లైనప్‌కు నాయకత్వం వహించనున్నాడు. టాప్ టెస్ట్ ర్యాంకర్ జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి బౌలింగ్ భారం మోయబోతున్నాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్ అత్యధిక వికెట్లు తీసిన ఈ హైదరాబాద్ బౌలర్ స్వదేశంలో జరుగనున్న టెస్ట్ సిరీస్‌లో తనదైన ముద్రవేయాలని భావిస్తున్నాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత జట్టు మూడోస్థానంలో ఉంది. ఈ సైకిల్ ప్రారంభంలో స్వదేశంలో జరిగిన టెస్టుల్లో భారత జట్టు వెస్టిండిస్‌ను ఓడించడంతో పాటు ఇంగ్లండ్‌తో జరిగిన ఐదుటెస్టుల 2-2తో సిరీస్‌ను సమం చేసింది. అదే సమయంలో దక్షిణాఫ్రికా పాకిస్తాన్‌తో జరిగిన 1-1తో డ్రాతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ని సాధించింది. ఈ సిరీస్ %ఔజ% సైకిల్‌లో కీలకమైంది తెలిపాడు. దక్షిణాఫ్రికా డిఫెండింగ్ చాంపియన్స్ కాబట్టి.. పాకిస్తాన్‌తో జరిగిన సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకున్నప్పటికీ.. ఆ జట్టుపై రాణిస్తామని సిరాజ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం టీమిండియా మంచి ఫామ్‌లోనే ఉందని తెలిపాడు. ఇంగ్లండ్‌పై రాణించడంతోపాటు వెస్టిండీస్ సిరీస్‌ను గెలిచామని సిరాజ్ జియోస్టార్‌తో చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లోనూ సిరాజ్ అద్భుతంగా రాణించాడు. 23 వికెట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్‌పై సైతం అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. రెండు మ్యాచుల్లో పది వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని.. సవాల్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సిరాజ్ తెలిపాడు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.